www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18సం|| లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 218 | శుక్రవారం 09.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## ప్రతి జిల్లాకూ 5జీ..

### డిజిటల్ సేవలకు ఊతం

మొబైల్ కేంద్రంగా సుపరిపాలన.. 5జీతో కొత్త మార్పులు



- టెక్నాలజీతో ప్రతి భారతీయుడి జీవితంలో మార్పు
- డిజిటల్ శక్తితో వికసిస్తున్న నూతన భారత్
- మొబైల్ ఇప్పుడు సేవలకు సాధనం.. సృష్టికి వేదిక
- టెక్నాలజీని ప్రజల శక్తిగా మార్చడమే లక్ష్యం
- ప్రతి జిల్లాకూ 5జీ.. ప్రతి ఒక్కరికీ అవకాశాలు
- డిజిటల్ కనెక్టివిటీతో అభివృద్ధికి కొత్త వేగం
- మొబైల్ చేతిలో ఉంటే అవకాశాలు మన ముందే

03

**చేతిలో మొబైల్.. కళ్లముందు ప్రభుత్వ సేవలు**

ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్, ఇంటర్నెట్‌కే పరిమితం కాకుండా సుపరిపాలన, ప్రభుత్వ సేవలు, విద్య, ఆర్థిక వ్యవస్థకు కీలక సాధనంగా మారిందని అన్నారు. 2022లో ప్రారంభమైన 5జీ సేవలు ఇప్పుడు దేశంలోని ప్రతి జిల్లాకూ చేరాయని, మొబైల్ ఇంటర్నెట్ వేగం పది రెట్లు పెరిగిందని తెలిపారు. డీబీటీ ద్వారా రూ.50 లక్షల కోట్లకు పైగా నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేరాయని, టెక్నాలజీతో ప్రజలకు సేవలు మరింత సులభంగా అందుతున్నాయని పేర్కొన్నారు.





## సీఈసీ జ్ఞానేష్ కుమార్ భద్రత పెంపు..

- నిరసనల ప్రభావం.. సీఈసీ పర్యటన వాయిదా
- జ్ఞానేశ్ కుమార్‌కు జెడ్ ప్లస్.. కట్టుదిట్టమైన భద్రత
- సీఈసీపై నిరసనలు.. భద్రతపై కేంద్రం కీలక నిర్ణయం
- నిరసనల తీవ్రతతో సీఈసీ పర్యటన వాయిదా

05

**దేశవ్యాప్త నిరసనలతో కేంద్రం అప్రమత్తం**

## భారత్‌లో స్టార్ లింక్‌ను అడ్డుకుంటున్నారు..



- స్టార్‌లింక్ క్లియరెన్స్‌లపై మస్క్ అసంతృప్తి
- మస్క్ ఆరోపణలతో టెలికాం రంగంలో కొత్త చర్చ
- స్టార్‌లింక్ రాకను ఆపుతున్న కుబేరులెవరు: కేటీఆర్
- గుత్తాధిపత్యం కాపాడేందుకే అడ్డంకులా: మస్క్
- శాటిలైట్ ఇంటర్నెట్‌పై మస్క్ సంచలన వ్యాఖ్యలు

07










# ఆరుగురు మంత్రులు అరెస్ట్

ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యానికి కాంగ్రెస్ పిలుపు

**నిరసనను అడ్డుకున్న పోలీసులు.. నేతల అరెస్టులతో ఉద్రిక్తత**

## ఓటర్ల హక్కుల కోసం గళమెత్తిన కాంగ్రెస్ నేతలు

- 'సేవ్ డెమోక్రసీ'తో హైదరాబాద్‌లో ఇండియా కూటమి ర్యాలీ
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో ఉద్రిక్తంగా మారిన ఆందోళన
- బారికేడ్లు బద్దలు కొట్టే యత్నం.. పలువురు నేతల అరెస్ట్
- నెక్లెస్ రోడ్‌లో హైటెన్షన్.. పోలీసులతో నిరసనకారుల వాగ్వాదం
- ఎన్నికల సంఘంపై ఆగ్రహం.. రోడ్డెక్కిన ఇండియా కూటమి
- జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిరసన
- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు.. నేతల అదుపులోకి

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరుబాట

03

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించేవరకు మా పోరాటం ఆగదు: మంత్రులు

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుంచి తొలగించేవరకు నిరసనలు ఆగవని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో లేని ఇతర రాష్ట్రాల్లో కూడా ఆందోళన చేపడతామని.. దేశవ్యాప్తంగా నిరసనలు హోరెత్తిస్తామని అన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ముఖ్య నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని..సీఈసీ జ్ఞానేశ్ రాజీనామా చేసేవరకు పోరాడతామని అన్నారు. ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనని అన్నారు.

## ఆయనకు చివరకు ఏమైందో తెలుసుకో..

ఓటర్ల జాబితాపై రగడ.. ఎన్నికల సంఘంపై విమర్శలు

**ఎస్ఐఆర్ రద్దుకు డిమాండ్.. ఫ్రీడమ్ పార్క్‌లో నిరసన**

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పోరాటంలో భాగం కావడానికి వచ్చాను : ధ్రువ్ రాఠీ

- ఓటర్ల జాబితాపై రగడ.. ఎన్నికల సంఘంపై విమర్శలు
- ఎస్ఐఆర్ రద్దుకు డిమాండ్.. ఫ్రీడమ్ పార్క్‌లో నిరసన
- ఎన్నికల జాబితాలో అవకతవకలపై విపక్షాల ఆగ్రహం
- ఓటు హక్కు అంశంపై బెంగళూరులో భారీ నిరసన
- ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలంటూ గళమెత్తిన నేతలు
- ఫ్రీడమ్ పార్క్ వేదికగా ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలు
- ఎన్నికల సంఘం తీరుపై ధ్రువ్, ప్రకాశ్ రాజ్ ధ్వజం
- ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో బెంగళూరులో నిరసన
- ఓటర్ల జాబితా సవరణపై 'పీపుల్స్ ట్రిబ్యునల్'

02

## రైతుల చేతులకు బేడీలు..

- నీళ్లు ఇవ్వకుండా కేసులా.. హరీశ్ రావు ఫైర్
- సాగునీటి సమస్యపై కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్ ప్రశ్నలు
- అక్రమ కేసులతో భయపెట్టే ప్రయత్నం: హరీశ్ రావు
- కృష్ణా జలాల వినియోగంపై కాంగ్రెస్‌పై విమర్శలు
- ప్రజా పాలననా.. ప్రజా పీడననా: హరీశ్ రావు
- నీటి సమస్యను పరిష్కరించాలి.. కేసులు కాదు
- ప్రభుత్వ వైఫల్యంతో పంటలకు నీటి కష్టాలు

03



కుంభకోణాల గనిగా సింగరేణి..14న భారీ బహిరంగ సభ



## కనీస పరిశుభ్రత కరువు..

- పండుగ వేళ అక్రమాలపై టీ.జీ. సేఫ్ ప్రత్యేక నిఘా
- ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో విస్తృత తనిఖీలు
- అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రత్యేక ఫోకస్
- ప్రజల భద్రత కోసం అధికారుల అప్రమత్త చర్యలు

ఆహార నాణ్యతపై రాజీ లేదు.. అధికారుల హెచ్చరిక

02

తనిఖీల సందర్భంగా తయారీ కేంద్రాల్లోని దారుణ పరిస్థితులను చూసి అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పేణీలను తయారు చేసే కార్మికులు కనీస పరిశుభ్రతా నియమాలను పాటించడం లేదని గుర్తించారు. హెయిర్ క్యాప్స్, గ్లోవ్స్ వంటి రక్షణ పరికరాలు లేకుండానే, మురికి దుస్తులు ధరించి, ఒంటి నిండా పట్టిన చెమటతోనే ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. మరింత దారుణమైన విషయమేమిటంటే.. పేణీల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను, తయారైన మిఠాయిలను ఏమాత్రం పరిశుభ్రత లేని నేలపైనే ఉంచి విక్రయాలకు సిద్ధం చేస్తున్నట్లు తనిఖీల్లో బయట పడింది.



## బాలీవుడ్‌లో అంతులేని విషాదం..

నా దహన సంస్కారాల్లో ఎండిన కట్టెలే వాడాలి..

08

నానా పటేకర్ చివరి కోరిక

- భూతాపానికి ఎల్ నినో తోడు.. పెరగనున్న వేడి
- పసిఫిక్‌లో అసాధారణ వేడి.. ప్రపంచవ్యాప్తంగా ప్రభావాలు
- ఎల్ నినో విజృంభణతో కరువు, వరదల ముప్పు
- సముద్ర ఉపరితలంలో భారీ వేడి.. నిపుణుల హెచ్చరిక
- ప్రపంచ వాతావరణానికి ఎల్ నినో సవాల్
- ఎర్రగా మారుతున్న భూగోళం.. ఎల్ నినో ప్రభావం

02

## ఎర్రగా మారిన ప్రపంచం..



1950 తర్వాత అత్యంత బలమైన ఎల్ నినోకు సంకేతాలు

# ఆరుగురు మంత్రులు అరెస్ట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ 'సేవ్ డెమోక్రసీ' నినాదంతో హైదరాబాద్‌లో ఇండియా కూటమి చేపట్టిన ఆందోళనా కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కూటమి నేతలు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇండియా కూటమి నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, వామపక్ష నేతలు కలిసి నెక్లెస్ రోడ్ మీదుగా లోకభవన్ వైపు ర్యాలీగా బయలుదేరారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా, "ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకోకుండా నెక్లెస్ రోడ్‌లోనే పోలీసులు భారీగా ముళ్లకంపలు, బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. నిరసనకారులు బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర నెట్టివేత, ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**ప్రముఖ మంత్రులు, సీనియర్ నేతల అరెస్ట్..**

పరిస్థితి చెయ్యి దాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు మహమ్మద్ అజారుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని వెంటనే వాహనాల్లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు (తెలంగాణ పీసీసీ) మహేష్ కుమార్ గౌడ్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**పోలీస్ స్టేషన్ వద్ద హంగామా..**

మంత్రులు, సీనియర్ నాయకుల అరెస్ట్ వార్త తెలియడంతో పంజాగుట్ట పోలీస్ స్టేషన్ వద్దకు కాంగ్రెస్, వామపక్ష కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషను వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని, ప్రశ్నించే గొంతులను పోలీసులతో నొక్కేయాలని చూస్తోందని అరెస్టయిన నాయకులు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తెలంగాణను బీజేపీ టార్గెట్ చేసింది.. 92 లక్షల ఓట్లు తొలగించారంటూ మహేశ్ ఆరోపణలు**

మోదీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందో దేశ ప్రజలు గమనిస్తున్నారని.. ఇప్పటికైనా దేశ ప్రజలు మేల్కొవాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేష్ ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో యథేచ్ఛగా ఓట్ చోరీ జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్నామన్నారు. బిహార్, వెస్ట్ బెంగాల్ తర్వాత తెలంగాణను బీజేపీ ప్రభుత్వం టార్గెట్ చేసిందని మహేశ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ కుమ్మక్కై 92 లక్షల ఓట్లు తొలగించిందని ఆరోపించారు. మోదీ, అమిత్‌షా వల్ల 12 సంవత్సరాల్లో దేశ ప్రజలకు ఎంత మేలు కలిగిందో ఆలోచించాలన్నారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు.

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించేవరకు మా పోరాటం ఆగదు: మంత్రులు**

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుంచి తొలగించేవరకు నిరసనలు ఆగవని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో లేని ఇతర రాష్ట్రాల్లో కూడా ఆందోళన చేపడతామని.. దేశవ్యాప్తంగా నిరసనలు హోరెత్తిస్తామని అన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ముఖ్య నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని..సీఈసీ జ్ఞానేశ్ రాజీనామా చేసేవరకు పోరాడతామని అన్నారు. ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనని అన్నారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..**

స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని బీజేపీ అనుబంధ సంస్థలాగా మార్చిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు మంత్రి పొన్నం. వోట్ చోరీపై రాహుల్ గాంధీ పోరాడుతున్నారని... ప్రజాస్వామ్యాన్ని మోడీ, అమిత్ షా ఖూనీ చేస్తున్నారని అన్నారు మంత్రి పొన్నం.

**మంత్రి జూపల్లి మాట్లాడుతూ..**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోడీ, అమిత్ షా ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



## క్యాన్సర్ ఔషధాల మార్జిన్‌పై పరిమితి విధించిన కేంద్రం

**ఢిల్లీ :** క్యాన్సర్ రోగులకు ఉపశమనం కలిగిస్తూ, అన్ని రకాల షెడ్యూల్ చేయని క్యాన్సర్ నిరోధక ఔషధాలపై ట్రేడ్ మార్జిన్‌ను గరిష్ఠ రిటైల్ ధరలో 30 శాతానికి పరిమితం చేస్తూ ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. అధికారిక వర్గాలను ఉటంకిస్తూ ఏఎన్ఐ ఈ విషయాన్ని వెల్లడించింది. స్వదేశీ, దిగుమతి చేసుకున్న, బ్రాండెడ్, జెనెరిక్, పేటెంట్ పొందిన, పేటెంట్ లేని అన్ని రకాల క్యాన్సర్ మందులకు వర్తిస్తుంది. విపరీతమైన లాభాల మార్జిన్లను అరికట్టడం ద్వారా ఈ ప్రాణరక్షణ ఔషధాల ధరలను తగ్గించడం, రోగులకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడం, నిరంతర సరఫరాను నిర్ధారించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ చర్య వల్ల సంబంధిత క్యాన్సర్ ఔషధాల ఎంఆర్‌పీ దాదాపు 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల క్యాన్సర్ బాధితులకు ఏటా సుమారు రూ. 2,500 కోట్ల వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గతంలో 2019లో తీసుకున్న ఇలాంటి నిర్ణయం ద్వారా 526 రకాల బ్రాండెడ్ మందులపై ఏటా రూ. 984 కోట్లు ఆదా కాగా, ఈసారి పరిమితిని మరింత విస్తరిస్తూ అన్ని రకాల షెడ్యూల్ చేయని క్యాన్సర్ ఔషధాలకు వర్తింపజేశారు. వైద్య చికిత్సను సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చేందుకు, రోగులపై పడే ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

## ఎర్రగా మారిన ప్రపంచం..

**ఢిల్లీ :** ప్రపంచాన్ని "ఎల్ నినో" వణికిస్తోంది. ప్రపంచ వాతావరణంపై ఎల్ నినో తన పంజా విసిరేందుకు సిద్ధమైందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఏర్పడిన ఎల్ నినో 1950 తర్వాత నమోదైన అత్యంత బలమైన వాతావరణ దృగ్విషయంగా మారే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ "ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ)" హెచ్చరించింది. ఎల్ నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశ ఉంది. పసిఫిక్ మహాసముద్రంలోని భారీ ఉష్ణశక్తి వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. డబ్ల్యూఎంఓ అంచనా ప్రకారం అక్టోబర్ -నవంబర్-డిసెంబర్ కాలంలో ఎల్ నినోకు కేంద్రంగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా సుమారు 3.7 డిగ్రీల వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది. వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మాయే ప్రపంచ ఉష్ణోగ్రతలకు సంబంధించిన ప్రపంచ మ్యాప్‌ను సోషల్ మీడివయాలో షేర్ చేశారు. "భూమి దాదాపు మొత్తం ఎర్రగా ఉంది" అని కామెంట్ చేశారు. ఎల్ నినో చలికాలం వరకు గరిష్ఠ స్థాయికి చేరుకోవచ్చని, అమెరికా మినహా అనేక ప్రాంతాల్లో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరో వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ పసిఫిక్ ప్రాంతంలో 3.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదలను "సూపర్ డూపర్ ఎల్ నినో"గా అభివర్ణించారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడాన్ని "ఎల్ నినో"గా వ్యవహరిస్తారు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా వర్షాల్లో అసమానతలు చోటుచేసుకుంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడితే, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు ముప్పు పెరుగొచ్చు. ఈ ఎల్ నినో 2024 ఫిబ్రవరి వరకు కొనసాగొచ్చని అంచనా వేస్తున్నారు.

## ఆయనకు చివరకు ఏమైందో తెలుసుకో..

**బెంగళూరు :** 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' అనేది కేవలం నినాదం మాత్రమేనని దాని వెనుక అసలు ఉద్దేశం 'వన్ నేషన్, వన్ పార్టీ' అని కాక్రోచ్ జనతా పార్టీ చీఫ్ అభిజిత్ దీప్కే అన్నారు. గతంలో జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్‌ది కూడా 'వన్ నేషన్, వన్ పార్టీ' ఆలోచనతోనే ఉన్నారని కానీ హిట్లర్‌కు చివరకు ఏమైందో ప్రధాని నరేంద్ర మోడీ తెలుసుకోవాలన్నార హిట్లర్ చివరకు తుపాకీతో తనకు తానే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సీజేపీ ఆధ్వర్యంలో ఇవాళ బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో 'పీపుల్స్ ట్రిబ్యునల్' (ప్రజా కోర్టు) నిర్వహించారు. ఈ మెగా నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు, కార్యకర్త ప్రకాష్ రాజ్, ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ పాల్గొని కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా గళం విప్పారు.

**ఇది ప్రజాస్వామ్యానికే మరణం:**

బతికున్న వారిని కూడా ఎస్ఐఆర్ లో మృతులుగా మార్చి ఓట్లు తొలగిస్తున్నారని దీప్కే విమర్శించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా తమ ఓటు హక్కు కోల్పోయిన పలువురు కర్ణాటక ఓటర్లు పీపుల్స్ ట్రిబ్యునల్ కు హాజ-రయ్యారు. ఈ సందర్భంగ ఎస్ఐఆర్ రద్దు చేయాలని, జ్ఞానేశ్ కుమార్ గద్దె దిగిపోవాలని సీజేపీ నిరసనకారులు నినాదాలు చేశారు. ఓటర్ల జాబితా సవరణలో జరిగిన అక్రమాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ ట్రిబ్యునల్‌లో సీజేపీకి చెందిన అభిజిత్ దిప్కేతో పాటు ప్రకాష్ రాజ్, ధ్రువ్ రాఠీలు ఒకే వేదికపైకి వచ్చి నిరసన తెలిపారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన సందర్భంగా ఢిల్లీ పోలీసు సిబ్బంది తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన మహిళా జర్నలిస్టులకు మద్దతుగా సీజేపీ 'చప్పల్ ప్రొటెస్ట్'

**ప్రకాష్ రాజ్ తీవ్ర విమర్శలు:**

ఈ సందర్భంగా ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల సంఘం దేశమంతటికీ అవమానం తెచ్చిపెట్టిందని మండిపడ్డారు. ఈ దేశంలో గతంలో ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు కానీ ఎస్ఐఆర్ ద్వారా ప్రభుత్వమే ఎవరు ఓటు వేయాలో నిర్ణయిస్తోందని ఆరోపించారు. 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుమారు 13 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికి కారణమైన ఎస్ఐఆర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగిస్తే సమస్య తీరదని ఎస్ఐఆర్ రద్దే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే సీఈసీ పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు.

**ప్రభుత్వ మార్పు కోసం రాలేదు - ధ్రువ్ రాఠీ:**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూట్యూబర్ ధ్రువ్ రాఠీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం వైపు నుంచి ఎలాంటి పారదర్శకత, జవాబుదారీతనం లేదని ఆరోపించారు. కర్ణాటకలోని 100 పోలింగ్ స్టేషన్లలో ఎస్ఐఆర్ వల్ల జరిగిన అక్రమాలపై ఆయన ఒక నివేదికను విడుదల చేశారు. "నేను ఇక్కడ ప్రభుత్వ మార్పు కోసం రాలేదు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పోరాటంలో భాగం కావడానికి వచ్చాను" అని ధ్రువ్ రాఠీ స్పష్టం చేశారు. కాగా బీజేపీ ప్రభుత్వ విధానాలపై చాలా కాలంగా యూట్యూబ్ లో వీడియోలు చేస్తున్న ధ్రువ్ రాఠీ ప్రత్యక్షంగా నిరసనలో పాల్గొనడం ఇదే తొలిసారి.

# కనీస పరిశుభ్రత కరువు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పండుగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో నగరవాసుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హైదరాబాద్ వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నగరంలోని 'సియుఆర్ఇ' జోన్ పరిధిలో ఉన్న 12 పేణీల తయారీ ఖార్ఖానాలపై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. పండుగ రోజుల్లో విరివిగా అమ్ముడయ్యే ఈ మిఠాయిలను నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నట్లు ఈ సోదాల్లో స్పష్టంగా వెల్లడైంది.

**కనీస పరిశుభ్రత కరువు.. మురికి దుస్తులతో తయారీ**

తనిఖీల సందర్భంగా తయారీ కేంద్రాల్లోని దారుణ పరిస్థితులను చూసి అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పేణీలను తయారు చేసే కార్మికులు కనీస పరిశుభ్రతా నియమాలను పాటించడం లేదని గుర్తించారు. హెయిర్ క్యాప్స్, గ్లోవ్స్ వంటి రక్షణ పరికరాలు లేకుండానే, మురికి దుస్తులు ధరించి, ఒంటి నిండా పట్టిన చెమటతోనే ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. మరింత దారుణమైన విషయమేమిటంటే.. పేణీల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను, తయారైన మిఠాయిలను ఏమాత్రం పరిశుభ్రత లేని నేలపైనే ఉంచి విక్రయాలకు సిద్ధం చేస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది.

**ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేవు.. ప్రదర్శనలోనూ ఉల్లంఘనలు**

ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం ప్రతీ ఆహార తయారీ కేంద్రానికి చెల్లుబాటయ్యే లైసెన్స్ తప్పనిసరి. అయితే ఈ 12 కేంద్రాల్లో చాలా ఖార్ఖానాలు ఎలాంటి లైసెన్సులు లేకుండానే అక్రమంగా కొనసాగుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. లైసెన్సులు ఉన్న కొన్ని సంస్థలు కూడా నిబంధనల ప్రకారం బోర్డులను ప్రదర్శించకుండా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ, అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫుడ్ సేఫ్టీ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి భారీ జరిమానాలు విధిస్తామని టీ.జీ. సేఫ్ అధికారులు స్పష్టం చేశారు.



## భూముల రీ సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి రెవెన్యూ అధికారులకు నిర్వహించిన భూముల రీ సర్వేపై శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లాలో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్ నుంచి కింది స్థాయి రెవెన్యూ ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరూ భూముల రీ సర్వేపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. డీజీపీఎస్ రోవర్స్ ద్వారా భూముల కొలతలు చేపట్టే విధానంపై అవగాహన కలిగి ఉంటే క్షేత్ర-స్థాయిలో సర్వే నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వ ఆస్తులు, భూముల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో హద్దుల వివాదాలకు తావులేకుండా రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ పంచాయతీలకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా నుంచి క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# జీఎస్టీలో కీలక మార్పులు..



**ఢిల్లీ :** జీఎస్టీ కౌన్సిల్ 57వ సమావేశంలో వ్యాపార వర్గాలకు, పన్ను చెల్లింపుదారులకు ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సేవల ఎగుమతులకు సంబంధించిన నిబంధనలలో మార్పులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. విదేశీ క్లయింట్లకు తమ విదేశీ శాఖల ద్వారా సేవలు అందించే భారతీయ కంపెనీలకు ఇకపై ఎగుమతి ప్రయోజనాలు లభించనున్నాయి. అలాగే విదేశీ క్లయింట్లకు చెందిన వస్తువులకు సంబంధించి టెస్టింగ్, రిపేర్, సర్టిఫికేషన్, పరిశోధన లేదా ప్రాసెసింగ్ పనులను భారతదేశంలో నిర్వహిస్తే, ఆ వస్తువులు దేశం దాటి వెళ్లకపోయినా వాటిని సేవల ఎగువ-ంతులుగానే పరిగణిస్తారు. చిన్న ఈ-కామర్స్ విక్రేతల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, విక్రేత ఒక రాష్ట్రంలో భౌతిక ఉనికిని కలిగి ఉంటే చాలు, వేరే రాష్ట్రంలోని ఈ-కామర్స్ ఆపరేటర్ వేర్‌హౌస్‌ను తమ ప్రధాన వ్యాపార స్థలంగా ప్రకటించుకోవడానికి అనుమతి లభిస్తుంది. ఈ 57వ సమావేశంలో పన్ను రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదని, ఇకపై రేట్ల సమీక్షను ఏడాదికి ఒకసారి ప్రత్యేకంగా జరిగే సమావేశంలో మాత్రమే చేపడతామని కౌన్సిల్ స్పష్టం చేసింది. అంతేకాకుండా రవాణా రంగానికి పెద్ద ఊరటనిస్తూ, వేర్వేరు రాష్ట్రాల గుండా వెళ్లే సరుకు రవాణా వాహనాలను కేవలం ప్రారంభ, తుది పాయింట్లలో మాత్రమే తనిఖీ చేస్తారని, స్పష్టమైన సమాచారం ఉన్నప్పుడు జాయింట్ కమిషనర్ లేదా ఆపై స్థాయి అధికారిక అనుమతితోనే వాహనాలను నిలిపివేసేందుకు వీలుంటుందని తెలిపారు. ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కింద ఇన్పుట్ సేవలపై చెల్లించిన పన్నులకు కూడా ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ రిఫండ్ సౌకర్యాన్ని విస్తరించారు. ఈ ప్రయోజనం 2026 నవంబర్ 1 తర్వాత పొందే క్రెడిట్‌కు వర్తిస్తుండగా, ప్లాంట్ అండ్ మెషినరీపై రిఫండ్‌ను నెలవారీ పద్ధతిలో లెక్కించి 2027 ఏప్రిల్ 1 నుండి అమలు చేయనున్నారు. ఉద్యోగులకు యాజమాన్యాలు అందించే హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై, అలాగే ఫ్యాక్టరీ వెలుపల వేసే టెలికాం టవర్లు, పైప్‌లైన్లపై ఐటీసీ పొందేందుకు కౌన్సిల్ అనుమతించింది. దీనికి తోడు సాధారణ జీఎస్టీ జరిమానాను రూ. 25,000 నుండి రూ. 10,000కి తగ్గించారు. పన్నుల పరిపాలనను సులభతరం చేసే దిశగా అరెస్టు అధికారాలను తొలగించడమే కాకుండా, క్రిమినల్ ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచారు. ఈ నిర్ణయాల పట్ల వ్యాపార, నిపుణ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అరెస్టు నిబంధనల సవరణ, ప్రాసిక్యూషన్ పరిమితి పెంపు వల్ల ఉద్దేశపూర్వక పన్ను ఎగవేతలకు, సాంకేతిక లోపాలు లేదా బకాయిల వివాదాలకు తేడా స్పష్టమవుతుందని, తద్వారా పన్ను విధానంలో మరింత పారదర్శకత పెరిగి వ్యాపార నిర్వహణ సులభతరం అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఆర్‌ఎఫ్ ప్రాంతాల్లో తనిఖీలు... ఎర్రచందనం దుంగలు స్వాధీనం



**కడప,ఫ్లాష్ ఇండియా :**

కడప జిల్లా ప్రొద్దుటూరు అటవీ పరిధిలోని లంకమల్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించి సుమారు 234 కిలోల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా అటవీశాఖాధికారి నుంచి అందిన సమాచారంతో ప్రొద్దుటూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో బిక్కితిప్ప, నాగసానిపల్లి బీట్, లంకమల్ల ఆర్‌ఎఫ్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, దుంగలను అక్కడే వదిలి స్మగ్లర్లు పరారయ్యారు. పరారైన వారి కోసం అటవీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ప్రతి జిల్లాకూ 5జీ..

## మొబైల్ ఇప్పుడు కేవలం ఫోన్ మాత్రమే కాదు

**ఢిల్లీ:** దేశంలో టెలికాం రంగం, మొబైల్ ఫోన్లు కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని సుపరిపాలనకు, ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడంలో అత్యంత కీలక సాధనంగా మారిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని యశోభూమిలో ఇవాళ ప్రారంభమైన 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో మోడీ ప్రసంగించారు. వందలాది ప్రభుత్వ సేవలు ఇప్పుడు మొబైల్ ఫోన్‌లలో అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ సహాయం లబ్ధిదారుల మొబైల్ ఫోన్‌లకు అనుసంధానించబడిన వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేయబడుతోందని అన్నారు. డిజిటల్ అనుసంధానత విద్యకు మరింత ఊతమిచ్చిందని అన్నారు.

**ఫోన్, నెట్‌వర్క్ భద్రతకు ప్రాధాన్యం:**

టెలికాం, డిజిటల్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మోడీ ఈ సందర్భంగా అన్నారు. ఫోన్ భద్రత, నెట్‌వర్క్ భద్రత మనందరికీ ప్రాధాన్య అంశాలు అని స్పష్టం చేశారు. 2022లో ఇదే వేదికపై నుంచి మనం దేశంలో 5జీ సేవలను ప్రారంభించాం. 2023లో 5జీ సేవలను విస్తరించడంపై దృష్టి పెట్టగా నేడు దేశంలోని ప్రతి జిల్లాకూ 5జీ నెట్‌వర్క్ చేరుకుందని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయని 2022తో పోలిస్తే ప్రస్తుతం మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగిందని ప్రధాని వెల్లడించారు. దేశం 5జీ రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు ముందుకు సాగుతోందని తెలిపారు. గత దశాబ్దంలో దేశవ్యాప్తంగా టెలికాం మౌలిక వసతులు గణనీయంగా విస్తరించాయని ప్రధాని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో మొబైల్ టవర్ల ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ, డేటా ధరలు అందుబాటులోకి రావడం వంటి పరిణామాలను ప్రస్తావించారు. ఈ విస్తరణతో ఆర్థిక వ్యవస్థలో కొత్త రంగాలు పుట్టుకొచ్చాయని, టెక్నాలజీ, వినోదం, విద్య రంగాల్లో వినియోగదారుల సంఖ్య పెరిగిందని చెప్పారు. కొత్త తరం కంటెంట్ క్రియేటర్లకు కూడా ఇది అవకాశాలను కల్పించిందన్నారు.

**రూ.50 లక్షల కోట్ల నేరుగా బదిలీ:**

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లతో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు రూ.50 లక్షల కోట్ల నిధులు చేరాయని మోడీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ విధానం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా చేసినట్లు చెప్పారు. నిధులు తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం వల్ల ఈ ఆదా సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు, పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గిందని, తక్కువ ప్రయాణం, తక్కువ నిరీక్షణ, తక్కువ ఖర్చుతో పాటు ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతోందని వివరించారు. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్లకు పైగా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేసినట్లు మోడీ తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ మొత్తాన్ని బదిలీ చేస్తున్నామని, నగదు జమ అయిన వెంటనే రైతుల మొబైల్ ఫోన్లకు నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. గతంలో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందలేకపోయిన కోట్లాది మంది చిన్న రైతులకు కూడా ఇప్పుడు నిధులు నేరుగా చేరుతున్నాయని పేర్కొన్నారు.

**మొబైల్‌లో గేమింగ్.. క్రియేషన్ స్టూడియో**

భారత్‌లో 50 కోట్ల మందికి పైగా ప్రజలు ఏదో ఒక రూపంలో గేమింగ్‌తో అనుసంధానమై ఉన్నారని మోడీ పేర్కొన్నారు. వీరిలో ఎక్కువ మంది యువతేనన్నారు. టైర్-2, టైర్-3 నగరాలకు చెందిన యువత గేమింగ్, ఈ-స్పోర్ట్స్, గేమింగ్ కంటెంట్ క్రియేషన్, కొత్త గేమింగ్ వ్యాపారాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. భారత్‌లో మొబైల్ ఫోన్ ఇప్పుడు గేమింగ్ కన్సోల్‌తో పాటు క్రియేషన్ స్టూడియోగా కూడా మారిందన్నారు.



## రైతుల చేతులకు బేడీలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రేవంత్ పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. ఇంజనీర్లతో రైతులపై కేసులు పెట్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. మీ చేతగాని తనం వల్ల ఈరోజు పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్న దుస్థితి ఏర్పడిందని వాపోయారు. ఈ మేరకు తాజాగా గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కడుపు మండిన రైతన్న రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తారా? పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేస్తారా? ఇదెక్కడి దుర్మార్గం? ఇదెక్కడి అన్యాయం? అని హరీశ్ రావు ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం వహించింది మీరు.. నీళ్లను ఒడిసి పట్టకుండా, విడిచిపెట్టి తెలంగాణకు జల ద్రోహం చేసింది మీరంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నాయకులపై మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. తప్పు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే, శిక్ష రైతులు అనుభవించాలా? అని నిలదీశారు. సాగునీళ్లు లేక, కరెంట్ లేక రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే.. పరిష్కరించాల్సింది పోయి అక్రమ కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. ఇది ప్రజా పాలననా? లేక ప్రజా పీడననా? రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతు వ్యతిరేక చర్యలు ఇలాగే కొనసాగిస్తే, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు.

# కేటీఆర్‌కు దానం సవాల్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నిక నేపథ్యంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన సవాల్ విసిరారు. ఇవాళ ఇండీ కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొన్న దానం మాట్లాడుతూ.. ఖైరతాబాద్‌లో తనపై బరిలోకి దిగి పోటీ చేయాలని కేటీఆర్‌కు ఆయన ఓపెన్ ఛాలెంజ్ చేశారు. బై ఎలెక్షన్‌కు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని కామెంట్ చేశారు. దానం నాగేందర్ అంటేనే ఓ బ్రాండ్ అని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక తమ ప్రభుత్వ పాలనకు రెఫరెండం కాబోతోందని పేర్కొన్నారు.

**ఈసీ, సీఈసీ తీరుపై మండిపాటు..**

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపై దానం నాగేందర్ స్పందించారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక్కరే కాకుండా, ఇండీ కూటమి ఎంపీలు, యువత పెద్దఎత్తున కలిసి వస్తున్నారని తెలిపారు. ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆ అధికారం ఎవరిచ్చారంటూ ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఖైరతాబద్ ఉపఎన్నికలో విజయం సాధించి తీరుతామని, ఈ ఎన్నిక ద్వారా ప్రత్యర్థులకు తగిన గుణపాఠం చెబుతామని దానం నాగేందర్ స్పష్టం చేశారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర



**భైంసా,ఫ్లాష్ ఇండియా :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం భైంసాలోని ఎస్.ఎస్. జిన్నింగ్ ఇండస్ట్రీలో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన 30 మంది విద్యార్థులు, ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశాలు సాధించిన ఆరుగురు విద్యార్థులతో పాటు 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యతోనే సమాజం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. ముధోల్‌లో రూ.300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, కుంటాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రూ.9 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కుంభకోణాల గనిగా సింగరేణి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ పాలనలో సింగరేణి కార్మికులు రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిపోయిన సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతీ ఏటా బొగ్గు ఉత్పత్తిని పెంచగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏకంగా 12 మిలియన్ టన్నుల ఉత్పత్తి పడిపోయిందని ఆరోపించారు. సంస్థ రోజురోజుకూ దిగజారిపోతోందని, సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చేశారని విమర్శించిన ఆయన, ఉత్పత్తి పడిపోవడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కార్మికుల సమస్యలపై పోరాడేందుకు అక్టోబర్ 14న రామగుండంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని సింగరేణి కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికుల ఆరోగ్య విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతూ, గుండె జబ్బులతో బాధపడుతున్న కార్మికులను అన్ ఫిట్ కింద పరిగణించాల్సింది పోయి, వారు ఫిట్ ఉన్నారని అబద్ధాలు చెప్పి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఉసురు పోసుకుంటోందని ధ్వజమెత్తారు. వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి తక్షణమే డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే ప్రతి కార్మికుడికి ఇళ్ల స్థలం, రుణం ఇస్తామన్న కాంగ్రెస్.. మూడేళ్లయినా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కార్మికులకు సంస్థ లాభాల్లో వాటా ఇవ్వాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు తగ్గించి సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని కాంగ్రెస్ చూస్తోందని, అదే జరిగితే బీఆర్ఎస్ ఎట్టిపరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. చివరిగా, సింగరేణి ప్రాంత ప్రజల సంక్షేమం కోసమే సీఎస్ఆర్ నిధులను పూర్తిగా వినియోగించాలని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



**జోగులాంబ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల నియోజకవర్గంలో రిజర్వాయర్ల సామర్థ్యం పెంచే పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ జేబులు నింపుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మూడేళ్లుగా రిజర్వాయర్లలో తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. పెండింగ్ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆ హామీపై ఆమె అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించిన డీకే అరుణ.. దీనిని ప్రజా ప్రభుత్వం అని ఎలా అంటారని ప్రశ్నించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఇళ్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. గద్వాల మున్సిపాలిటీలో పన్నుల రూపంలో కోట్ల రూపాయలు వసూలు చేస్తూ, లెక్కల్లో మాత్రం లక్షల రూపాయలే చూపిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇదే విధానం కొనసాగితే గద్వాల్‌ను నాలుగు రోజుల్లోనే అమ్మేసే పరిస్థితి వస్తుందని విమర్శించారు. ఇటీవల నీటి విషయంలో కాంగ్రెస్ మంత్రులు కర్ణాటకకు వెళ్లి డ్రామా చేశారని డీకే అరుణ విమర్శించారు. వర్షాల కారణంగా వచ్చిన నీటిని కర్ణాటక ప్రభుత్వం విడుదల చేసిన నీరుగా ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం తెలంగాణకు చుక్క నీరు కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. నీటి కోసం రైతులు ఆందోళన చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. గత ఎన్నికల్లో డబ్బులు పంచి ఓట్లు కొనుగోలు చేయడం వల్లే గద్వాల్‌లో అప్పటి టీఆర్ఎస్ విజయం సాధించిందని డీకే అరుణ ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రజాసేవ కోసం కాకుండా సంపాదించుకోవడానికే పదవుల్లోకి వచ్చారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాయమాటలతోనే ప్రజలు ఆ పార్టీకి అధికారం అప్పగించారని అన్నారు. బీజేపీ ప్రతి ఒక్కరి గుండెల్లో ఉందని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, బలిగేరా నల్లారెడ్డి, మీర్జాపురం రామచంద్రారెడ్డి, బలిగేరా శివారెడ్డి, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి అక్కల రమాదేవి, బాబుల్‌రెడ్డి, దాస్, గట్టు సురేష్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జూరాల రైతులపై కేసులా..?



**జడ్చర్ల,ఫ్లాష్ ఇండియా :** జూరాల ఆయకట్టు రైతులపై కేసులు నమోదు చేయడాన్ని మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా. సి. లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. జూరాల డ్యాం వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణమని విమర్శించారు. కృష్ణా జలాలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. పంటలు ఎండిపోతుంటే చూడలేక రైతులు ఆందోళన బాట పట్టారని లక్ష్మారెడ్డి అన్నారు. ఆవేదనతో రైతులు ధర్నా చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాదని, ప్రజలను పీడించే పాలనగా మారిందని విమర్శించారు. రైతులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కేసులు నమోదు చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన, రైతులతో కలిసి పోరాటం చేపడతామని హెచ్చరించారు. ముందుగా రైతులకు సాగునీరు అందించే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.




## సంపాదకీయం



# సుంకం తగ్గింపు దేనికి సంకేతం?

'దేశంలో వంటనూనెల దిగుమతులను తగ్గించాలి, దేశీయ ఉత్పత్తిని పెంచాలి, రైతులను ఆయిల్పామ్ సాగువైపు ప్రోత్సహించాలి, వంటనూనెల విషయంలో దేశాన్ని స్వయం సమృద్ధి వైపు నడిపించాలి'-- ఇదీ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం. ఆ లక్ష్యంతోనే 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్--ఆయిల్పామ్' ద్వారా దేశవ్యాప్తంగా ఆయిల్పామ్ విస్తరణను ప్రోత్సహిస్తోంది. కేంద్రం ఇచ్చిన ఈ విధాన సంకేతాన్ని నమ్మి తెలంగాణ వంటి రాష్ట్రాలు క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ఆయిల్పామ్ సాగు విస్తరణకు శ్రీకారం చుట్టాయి. ఒకవైపు దేశీయ ఆయిల్పామ్ సాగును పెంచాలని చెబుతూ, మరోవైపు విదేశాల నుంచి వచ్చే క్రూడ్ పామాయిల్పై దిగుమతి సుంకాలను వరుసగా తగ్గించడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. 2024లో దేశీయ నూనెగింజల రైతులను చౌక దిగుమతుల నుంచి రక్షించేందుకు క్రూడ్ ఎడిబుల్ ఆయిల్స్పై ఎఫెక్టివ్ ఇంపోర్ట్ డ్యూటీని 27.5 శాతానికి పెంచిన కేంద్రం, ఆ తర్వాత దానిని 16.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు మరోసారి దిగుమతి సుంకాన్ని తగ్గించే నిర్ణయం తీసుకుంది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో వంటనూనెలు అందించాలనే లక్ష్యం అవసరమైనదే. కానీ ఆ ఉపశమనం కోసం దేశీయ రైతు ఆదాయం, అతని దీర్ఘకాలిక పెట్టుబడి, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆయిల్పామ్ విస్తరణ భవిష్యత్తు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కూడా అంతే అవసరం. ఆయిల్పామ్ విస్తరణ కేవలం ఢిల్లీలో ఒక ప్రకటనతో జరగదు. క్షేత్రస్థాయిలో రైతును ఒప్పించాలి, సంప్రదాయ పంటల నుంచి దీర్ఘకాలిక ఆయిల్పామ్ సాగువైపు మళ్లించాలి, మొక్కలను అందుబాటులోకి తేవాలి, సాగునీరు, డ్రిప్, తోటల నిర్వహణకు సహకరించాలి, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయించాలి, కంపెనీలు--రైతుల మధ్య సమన్వయం చేయాలి. ఈ మొత్తం బాధ్యతను ప్రత్యక్షంగా నిర్వహించేది రాష్ట్ర ప్రభుత్వాలే. తెలంగాణ ప్రభుత్వం కూడా రైతుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయిల్పామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహించింది. ఫలితంగా రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 3.2 లక్షల ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు విస్తరించింది. ఇక్కడే అసలు వైరుధ్యం కనిపిస్తోంది. రైతును ఆయిల్పామ్ సాగులోకి తీసుకువచ్చే బాధ్యత రాష్ట్రానిది. కానీ అదే రైతు పంట ధరను ప్రభావితం చేయగల దిగుమతి సుంకం నిర్ణయం మాత్రం కేంద్రం చేతిలో ఉంది. దిగుమతి సుంకాల తగ్గింపుతో చౌకైన విదేశీ పామాయిల్ దేశీయ మార్కెట్లోకి వచ్చి రైతు ఆదాయంపై ఒత్తిడి ఏర్పడితే, రైతు ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ప్రశ్నించడు. తనకు అందుబాటులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్నే అడుగుతాడు. స్థానిక ప్రజాప్రతినిధులను నిలదీస్తాడు. విధానం కేంద్రానిది, కానీ రైతు ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సింది రాష్ట్రం. ఈ పరిస్థితిని కేంద్రం విస్మరించకూడదు. ఇది కేంద్రం--రాష్ట్రం మధ్య రాజకీయ వివాదంగా చూడాల్సిన అంశం కాదు; సమాఖ్య వ్యవస్థలో వ్యవసాయ విధాన నిర్ణయాలు ఎలా ఉండాలన్న మౌలిక ప్రశ్న. ఆయిల్పామ్ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్రాలతో సంప్రదించకుండా దిగుమతి విధానంలో తరచూ మార్పులు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన భరోసాను ఎలా నిలబెట్టుకోగలుగుతాయి? ఆయిల్పామ్ను ఇతర పంటలతో పోల్చలేం. వేరుశెనగ, సోయాబీన్ వంటి పంటలు ఒక సీజన్లో గిట్టుబాటు కాకపోతే రైతు తర్వాతి సీజన్లో మరో పంటకు మారవచ్చు. ఆయిల్పామ్ రైతుకు ఆ అవకాశం లేదు. మొక్క నాటిన తర్వాత వాణిజ్య స్థాయిలో ఆదాయం రావడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. నీటి వసతి, డ్రిప్, ఎరువులు, నిర్వహణపై నిరంతరం పెట్టుబడి పెట్టాలి. ఒకసారి తోట ఏర్పాటు చేసిన రైతు దాదాపు మూడు దశాబ్దాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఆ పంటతో ముడిపడి ఉంటాడు. అంటే రైతు నాటింది కేవలం ఆయిల్పామ్ మొక్క కాదు; ప్రభుత్వ విధానంపై తన నమ్మకాన్ని. "విదేశీ పామాయిల్ను మరింత చౌకగా తీసుకొస్తే... నా పెట్టుబడికి, నా భవిష్యత్తుకు భరోసా ఎవరు?" అని రైతు అడిగితే దానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దిగుమతి సుంకం తగ్గినంత శాతంలోనే రైతుకు లభించే ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ (ఎఫ్ఎఫ్బీ) ధర తగ్గుతుందని చెప్పలేం. అంతర్జాతీయ క్రూడ్ పామాయిల్ (సీపీఓ) ధరలు, మారకపు విలువ, రవాణా వ్యయం, ప్రాసెసింగ్ మార్జిన్లు, ఎఫ్ఎఫ్బీ ధర నిర్ణయ విధానం వంటి అనేక అంశాలు తుది ధరను ప్రభావితం చేస్తాయి. కానీ చౌక దిగుమతులు దేశీయ ఉత్పత్తిపై ధరల ఒత్తిడిని పెంచే అవకాశాన్ని విస్మరించలేం. అందుకే నాడు రైతు రక్షణ కోసం అవసరమని భావించిన దిగుమతి రక్షణను నేడు వరుసగా ఎందుకు తగ్గించాల్సి వస్తోంది? అన్నది ప్రశ్న. వినియోగదారుడి ప్రయోజనం ముఖ్యమే, పరిశ్రమ ప్రయోజనం కూడా అవసరమే; కానీ వీటి మధ్య రైతు ప్రయోజనం బలికాకూడదు. ఇప్పటికే ఆయిల్పామ్ వేసిన రైతుకు భవిష్యత్ ఆదాయంపై అనిశ్చితి ఏర్పడితే కొత్త రైతులు ఈ పంట వైపు రావడానికి వెనుకాడతారు. తోటల నిర్వహణపై పెట్టుబడులు తగ్గవచ్చు, ప్రాసెసింగ్ సామర్థ్యంపైనా ప్రభావం పడవచ్చు. చివరకు వంటనూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలన్న జాతీయ లక్ష్యానికే ప్రతికూల పరిస్థితి ఏర్పడవచ్చు. కేంద్ర ప్రభుత్వం వినియోగదారుడిని రక్షించాలి, అదే సమయంలో ఆయిల్పామ్ రైతు ఆదాయాన్ని కూడా రక్షించాలి. ఈ రెండూ పరస్పర విరుద్ధ లక్ష్యాలు కావు. ముఖ్యంగా క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాల్లో కీలక మార్పులు చేసే ముందు ఆయిల్పామ్ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం సంప్రదింపులు జరపాలి. ఆయా రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం, కొత్తగా ఉత్పత్తిలోకి రాబోతున్న తోటలు, ఎఫ్ఎఫ్బీ ధరలు, రైతుల పెట్టుబడులు, ప్రాసెసింగ్ సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. దిగుమతి సుంకాల తగ్గింపు వల్ల ఎఫ్ఎఫ్బీ ధర ఒక నిర్దిష్ట రక్షణ స్థాయి కంటే పడిపోతే వయబిలిటీ గ్యాప్ ఫండ్ లేదా సమానమైన ఆదాయ రక్షణ వ్యవస్థ రైతుకు వెంటనే అందేలా చూడాలి. ఆయిల్పామ్ రైతులకు ప్రత్యేక ధర రక్షణ అవసరం. అన్నింటికంటే ముఖ్యంగా రైతుకు దీర్ఘకాలిక విధాన స్థిరత్వం కావాలి. ఎందుకంటే ఆయిల్పామ్ రైతు తన భూమిని, తన పెట్టుబడిని, తన కుటుంబ భవిష్యత్తును దాదాపు మూడు దశాబ్దాలపాటు ఈ పంటతో ముడిపెట్టాడు. అతను అడిగేది ప్రభుత్వ దయ కాదు-- తాను పండించే పంటకు గిట్టుబాటు ధర, తాను పెట్టిన పెట్టుబడికి రక్షణ, ప్రభుత్వం ఇచ్చిన మాటకు భరోసా. ఒక చేత్తో రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులను ఆయిల్పామ్ సాగువైపు ప్రోత్సహిస్తూ, మరో చేత్తో విదేశీ పామాయిల్కు దిగుమతి మార్గాన్ని మరింత చౌకగా చేస్తే రేపు కొత్త రైతును ఆయిల్పామ్ సాగు చేయమని రాష్ట్రాలు ఏ నమ్మకంతో అడగాలి? ఇది కేవలం దిగుమతి సుంకానికి సంబంధించిన ప్రశ్న కాదు; కేంద్రం తీసుకునే నిర్ణయానికి క్షేత్రస్థాయిలో మూల్యం ఎవరు చెల్లిస్తున్నారు అన్న ప్రశ్న. దేశీయ రైతును బలోపేతం చేసి వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే కేంద్రం--రాష్ట్రాలు కలిసి నడవాలి. విధాన నిర్ణయం ఒకచోట, దాని పరిణామాల భారం మరోచోట ఉండకూడదు. ఆత్మనిర్భరత ఒక నినాదంగా మిగలకూడదు, రైతుకు ఇచ్చిన మాటగా నిలవాలి. ఆ మాటను క్షేత్రస్థాయిలో నిలబెట్టే రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను కేంద్ర విధానాలే బలహీనపరచకూడదు.

# ప్రజాస్వామ్య పోరాటం మొదలైందా?

దశాబ్దాల పాటు భారత రాజకీయ, సామాజిక పరిణామాలను ప్రభావితం చేసిన మావోయిస్టు ఉద్యమం ఒక దశకు ముగింపు పలికిందనే చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాల ప్రకారం 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు సాయుధ ఉద్యమాన్ని అంతం చేసినట్లు ప్రకటించడం భారత అంతర్గత భద్రతా చరిత్రలో ఒక కీలక పరిణామంగా నిలిచింది. అయితే ఒక సాయుధ ఉద్యమం ముగియడం అంటే దానికి పునాది వేసిన సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రశ్నలు కూడా ముగిసిపోయినట్టేనా? అసలు ప్రశ్న ఇదే. భూమి, ఉపాధి, విద్య, సామాజిక అసమానత, కుల వివక్ష, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ వ్యవస్థల జవాబుదారీతనం వంటి అంశాలు ఇంకా సమాజం ముందున్నప్పుడు.. వాటిపై యువత ఎలా స్పందిస్తుంది? హింసాత్మక పోరాటాల స్థానంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు, విద్య, ఉద్యోగాలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ఆయుధాలుగా చేసుకుని కొత్త తరం ముందుకు వస్తుందా? ఇటీవలి పరిణామాలను పరిశీలిస్తే ఈ ప్రశ్నకు అవుననే సమాధానం కనిపించే పరిస్థితి ఏర్పడుతోంది. భారతదేశ చరిత్ర అనేది కేవలం రాజులు, ప్రభుత్వాలు, ఎన్నికలు, యుద్ధాల చరిత్ర కాదు. శతాబ్దాలుగా సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా, భూమి మరియు జీవనోపాధి కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా, సమానత్వం మరియు గౌరవం కోసం జరిగిన ప్రజా పోరాటాల చరిత్ర కూడా. ఈ క్రమంలో మావోయిస్టు ఉద్యమం ఒక ముఖ్యమైన అధ్యాయం. భూస్వామ్య ఆధిపత్యం, ఆర్థిక దోపిడీ, అణగారిన వర్గాల సమస్యలను అది రాజకీయ చర్చ మధ్యలోకి తీసుకొచ్చింది. అయితే ఆ ఉద్యమం ఎంచుకున్న సాయుధ పోరాట మార్గం, హింస, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా విప్లవ ప్రభుత్వాన్ని నిర్మించాలనే భావనపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. కాలక్రమేణా ఆ ఉద్యమంలో నాయకత్వం, సామాజిక ప్రాతినిధ్యం, అట్టడుగు వర్గాల భాగస్వామ్యం వంటి అంశాలపైనా ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అనేక మంది యువత ఈ పోరాటాల్లో ముందుండగా, నాయకత్వ నిర్మాణంలో సామాజిక సమతుల్యత ఎంతవరకు ప్రతిబింబించిందన్న ప్రశ్న ఇప్పటికీ రాజకీయ విశ్లేషణలో చర్చనీయాంశంగానే ఉంది. మావోయిస్టు ఉద్యమం సాగిన దశాబ్దాల్లో వ్యవస్థను ప్రశ్నించాలనుకున్న అనేక మంది యువత, విద్యార్థులు, మేధావులు కూడా అనుమానాల నీడలో జీవించాల్సి వచ్చిందన్న విమర్శ ఉంది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తే, భూసంబంధిత సమస్యలపై మాట్లాడితే, ఆదివాసీ హక్కులను ప్రస్తావిస్తే లేదా సామాజిక అసమానతలను ప్రశ్నిస్తే వారిపై 'మావోయిస్టు', 'అర్బన్ మావోయిస్టు' వంటి ముద్రలు పడే ప్రమాదం ఉందనే భావన కొంతమందిలో ఏర్పడింది. ఫలితంగా ప్రశ్నించే యువతలో ఒక వర్గం వెనుకడుగు వేసింది. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. డిజిటల్ యుగంలో పెరిగిన జెన్-జీ తరం తన ప్రశ్నలను దాచుకోవడానికి సిద్ధంగా లేదు. అది తుపాకీని కాదు.. మొబైల్ ఫోన్ను ఎంచుకుంది. అడవిని కాదు.. సోషల్ మీడియాను వేదికగా చేసుకుంది. సాయుధ పోరాటాన్ని కాదు.. రాజ్యాంగబద్ధమైన నిరసనను, కోర్టులను, ప్రజా వేదికలను, ఎన్నికలను, ఓటు హక్కును తన రాజకీయ సాధనాలుగా మలుచుకుంటోంది. ఇది కేవలం ఒక తరానికి వచ్చిన కోపం కాదు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పోటీ పరీక్షలపై అనుమానాలు, పేపర్ లీకేజీలు, నియామకాల ఆలస్యం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనత, వైద్య విద్యలో పెరుగుతున్న ఖర్చులు, సామాజిక ప్రాతినిధ్యం, కుల అసమానతలు, రాజకీయ అధికారంలో వాటా వంటి అనేక సమస్యలు యువతలో అసంతృప్తిని పెంచుతున్నాయి. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల చుట్టూ తలెత్తిన వివాదాలు లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలను జాతీయ చర్చగా మార్చాయి. పరీక్ష నిర్వహణలో పారదర్శకత కావాలని విద్యార్థులు కోరడం, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై ప్రశ్నించడం, ఉద్యోగాల కోసం నిరసనలు చేయడం, నియామక ప్రక్రియలో జవాబుదారీతనం కోరడం.. ఇవన్నీ రాజకీయ చైతన్యానికి కొత్త రూపాలుగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు రాజకీయ ఉద్యమం అంటే పార్టీ జెండా, నాయకుడి పిలుపు, భారీ సభ అని భావించేవారు. ఇప్పుడు ఒక పరీక్షలో జరిగిన అవకతవక కూడా యువతను రాజకీయంగా కదిలించగలుగుతోంది. ఇదే జెన్-జీ రాజకీయాల ప్రత్యేకత. ఈ తరం రాజకీయాలను కేవలం అధికార మార్పుగా చూడడం లేదు. తమ జీవితాన్ని ప్రభావితం చేసే ప్రతి నిర్ణయాన్ని రాజకీయ ప్రశ్నగా చూస్తోంది. ఉద్యోగం ఎందుకు రావడం లేదు? విద్య ఎందుకు ఖరీదవుతోంది? ప్రభుత్వ పాఠశాల ఎందుకు బలహీనపడుతోంది? పరీక్షల్లో పారదర్శకత ఎందుకు లేదు? అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం ఎంత? ఎన్నికల వ్యవస్థ ఎంత పారదర్శకంగా ఉంది? ఓటర్ల జాబితాలో తమ పేరు సురక్షితంగా ఉందా? వంటి ప్రశ్నలు ఇప్పుడు యువత రాజకీయ చర్చలో భాగమవుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి ఒక సానుకూల పరిణామం. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం కాదు. అధికారాన్ని నిరంతరం ప్రశ్నించడం, ప్రభుత్వాలను జవాబుదారిగా నిలబెట్టడం, ప్రజా విధానాలపై చర్చించడం కూడా ప్రజాస్వామ్యమే. ఈ కొత్త చైతన్యాన్ని ఫూలే--అంబేడ్కర్--కాన్షీరాం సామాజిక న్యాయ భావజాలంతో అనుసంధానం చేయాలనే వాదన కూడా ముందుకు వస్తోంది. జ్యోతిరావు ఫూలే విద్య, కుల వివక్ష నిర్మూలన, సామాజిక సమానత్వాన్ని ప్రధానంగా ముందుకు తెచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, రాజకీయ ప్రాతినిధ్యాన్ని సామాజిక విముక్తికి కీలక సాధనాలుగా చూశారు. కాన్షీరాం అణగారిన వర్గాలు రాజకీయ అధికారంలో తమ వాటాను సాధించాలనే ఆలోచనను బలపరిచారు. ఈ చరిత్రను చూస్తే నేటి జెన్-జీ చైతన్యాన్ని పూర్తిగా కొత్తదిగా కాకుండా.. పాత సామాజిక న్యాయ పోరాటాలకు డిజిటల్ యుగంలో వచ్చిన కొత్త రూపంగా కూడా చూడవచ్చు. అయితే ఈ పోలికను జాగ్రత్తగా చూడాలి. మావోయిస్టు ఉద్యమం, అంబేడ్కర్ భావజాలం, ఆధునిక యువజన ఉద్యమాలు ఒకటే కావు. వాటి సిద్ధాంతాలు, పద్ధతులు వేర్వేరు. కానీ అసమానతను ప్రశ్నించాలనే ఆకాంక్షలో ఒక సామాన్యత కనిపిస్తుంది. ఇటీవల యువతలో కనిపిస్తున్న డిజిటల్ ఉద్యమాలు, నిరసనలు, ప్రత్యామ్నాయ రాజకీయ వేదికలు ఈ మార్పుకు సంకేతాలుగా నిలుస్తున్నాయి. నిరుద్యోగ యువతపై వివాదాస్పద వ్యాఖ్యలు, పరీక్షా వ్యవస్థపై ఆగ్రహం, ఓటు హక్కు మరియు ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వంటి అంశాలు సోషల్ మీడియాలో వేగంగా రాజకీయ చర్చగా మారుతున్నాయి. ఒక వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కొత్త డిజిటల్ రాజకీయ వేదిక పుట్టుకొచ్చే పరిస్థితి రావడం.. రాజకీయ వ్యవస్థపై యువతలో ఉన్న అసంతృప్తి ఎంత వేగంగా కొత్త రూపం దాల్చగలదో చూపిస్తోంది. అయితే ప్రతి వైరల్ హ్యాష్ట్యాగ్ను విప్లవంగా చూడటం కూడా పొరపాటే. సోషల్ మీడియా ఆగ్రహం తాత్కాలికంగా ఉండవచ్చు. కానీ దాన్ని నిరంతర ప్రజా చైతన్యంగా మార్చాలంటే స్పష్టమైన విధానాలు, సంస్థాగత నిర్మాణం, రాజ్యాంగబద్ధమైన పోరాటం, సామాజిక ఐక్యత అవసరం. ఇక్కడే జెన్-జీ ముందున్న అసలు పరీక్ష మొదలవుతుంది. ప్రశ్నించడం మాత్రమే కాదు.. పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకురావాలి. సోషల్ మీడియాలో పోస్టు చేయడం మాత్రమే కాదు.. ప్రజా విధానాలను అర్థం చేసుకోవాలి. ప్రభుత్వాన్ని విమర్శించడం మాత్రమే కాదు.. ప్రత్యామ్నాయ విధానాలను సూచించాలి. కులం, మతం, ప్రాంతం పేరుతో యువతను విడదీసే రాజకీయాలకు బదులుగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, ఉపాధి, ఆరోగ్యం, పారదర్శక పాలన వంటి అంశాలపై ఐక్యతను నిర్మించాలి. అప్పుడు మాత్రమే ఈ చైతన్యం తాత్కాలిక ఆగ్రహాన్ని దాటి ప్రజాస్వామ్య ఉద్యమంగా రూపుదిద్దుకుంటుంది. మావోయిస్టు ఉద్యమం ముగిసిందని ప్రభుత్వం ప్రకటించడం ఒక భద్రతా విజయంగా ఉండవచ్చు. కానీ దాని కంటే పెద్ద విజయమేమిటంటే.. అదే సామాజిక అసంతృప్తి ఇకపై హింసకు కాకుండా ప్రజాస్వామ్యానికి దారి తీయడం. ఒకప్పుడు తుపాకీ శబ్దం వినిపించిన ప్రాంతాల్లో రేపు పాఠశాల గంట మోగాలి. భయంతో జీవించిన యువత రేపు ఓటు కేంద్రానికి ధైర్యంగా వెళ్లాలి. అడవుల్లో ప్రాణాలు కోల్పోయిన యువశక్తి ఇక విద్య, ఉపాధి, పరిశోధన, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక మార్పు కోసం వినియోగించబడాలి. అదే నిజమైన మార్పు. అందుకే నేటి జెన్-జీని కేవలం 'ఆగ్రహించిన తరం'గా చూడటం సరైంది కాదు. ఇది ప్రశ్నించే తరం. తమ భవిష్యత్తుపై హక్కు కోరుతున్న తరం. అధికారాన్ని జవాబుదారిగా నిలబెట్టాలని కోరుతున్న తరం. అయితే ఆ ప్రశ్నలకు దిశ అవసరం. ఆ దిశ రాజ్యాంగం కావాలి. ఆ పోరాటానికి పద్ధతి ప్రజాస్వామ్యం కావాలి. ఆ లక్ష్యం సామాజిక న్యాయం కావాలి. ఆ ప్రయాణానికి ఆయుధం ఐక్యత కావాలి. ఒక తరం తుపాకీతో వ్యవస్థను మార్చాలని ప్రయత్నించిన చరిత్ర మన ముందుంది. ఇప్పుడు మరో తరం ప్రశ్నతో, ఓటుతో, రాజ్యాంగంతో, విద్యతో, డిజిటల్ చైతన్యంతో వ్యవస్థను మార్చాలని ప్రయత్నిస్తోంది. ఈ మార్పు నిజమైన సామాజిక చైతన్యంగా ఎదుగుతుందా? లేక మరో తాత్కాలిక రాజకీయ అలగా మిగిలిపోతుందా? అన్నది రాబోయే కాలం నిర్ణయిస్తుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. యువత ప్రశ్నించడం మొదలుపెడితే ప్రజాస్వామ్యం మేల్కొంటుంది. ఆ ప్రశ్నలు కులం, వర్గం, పార్టీ గీతలను దాటి సమానత్వం, ప్రాతినిధ్యం, గౌరవం, అవకాశాల కోసం నిలబడితే.. భారత ప్రజాస్వామ్యంలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మావోయిజం ముగిసిన చోట ప్రజాస్వామ్య చైతన్యం మొదలైతే.. అదే ఈ దేశానికి అసలైన కొత్త రాజకీయ ఉదయం.

# రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక రైతు. నగరాల్లో పరిశ్రమలు, వ్యాపారాలు, సేవారంగం ఎంత అభివృద్ధి చెందినా ప్రజల ఆకలి తీర్చే బాధ్యత మాత్రం వ్యవసాయంపైనే ఉంటుంది. ఎండైనా, వానైనా, చలైనా పొలంలో కష్టపడే రైతు శ్రమ వల్లే మన ఇళ్లలో అన్నం చేరుతుంది. కానీ దేశానికి అన్నం పెట్టే రైతు జీవితం మాత్రం ఎన్నో సమస్యల మధ్య సాగుతోంది. పంట పండించేందుకు పెట్టుబడి పెరుగుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, సాగునీటి వ్యయం ఇలా ప్రతి అంశం రైతుపై ఆర్థిక భారాన్ని పెంచుతోంది. మరోవైపు పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్లో సరైన ధర లభించకపోవడం రైతు కష్టాన్ని మరింత పెంచుతోంది. ప్రకృతి వైపరీత్యాలు రైతు జీవితాన్ని ఒక్కసారిగా తలకిందులు చేస్తున్నాయి. అకాల వర్షాలు, వడగండ్ల వానలు, కరువు, వరదలు, తెగుళ్లు వంటి సమస్యలు ఏటా రైతులను వెంటాడుతున్నాయి. పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వం ప్రకటించే పరిహారం రైతుకు తక్షణ ఉపశమనాన్ని ఇవ్వాలి. కానీ అనేక సందర్భాల్లో పరిహారం అందేలోపు రైతు మరో పంట కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రైతు సమస్యలను కేవలం రుణమాఫీ లేదా పంట నష్టపరిహారంతో పరిష్కరించలేం. వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చే దీర్ఘకాలిక విధానాలు అవసరం. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయాలి. మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతు నేరుగా మార్కెట్కు చేరుకునే అవకాశాలు పెరగాలి. గ్రామీణ ప్రాంతాల్లో శీతల



గిడ్డంగులు, గోదాములు, ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పంటను వెంటనే తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి తగ్గుతుంది. సాగునీటి వనరుల పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రైతు కేవలం వర్షంపై ఆధారపడకుండా నీటి భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో విస్తృతంగా వినియోగించాలి. నేల పరీక్షలు, వాతావరణ సమాచారం, డ్రిప్ ఇరిగేషన్, యాంత్రీకరణ, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలపై రైతులకు సులభమైన శిక్షణ అందించాలి. చిన్న, సన్నకారు రైతులకు సాంకేతికత అందుబాటులోకి రావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రైతు కుటుంబాల్లో యువత వ్యవసాయాన్ని వదిలి ఇతర రంగాలకు వెళ్లకుండా వ్యవసాయాన్ని ఆధునిక వ్యాపారంగా మార్చే అవకాశాలు కల్పించాలి. పంటలతో పాటు పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య పరిశ్రమ, ఉద్యాన పంటలు వంటి అనుబంధ రంగాలను ప్రోత్సహించడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచవచ్చు. రైతు సంక్షేమం అంటే కేవలం ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాదు. రైతు పొలంలో విత్తనం వేసిన రోజు నుంచి పంట మార్కెట్కు చేరే వరకు ప్రతి దశలో ప్రభుత్వ సహకారం ఉండాలి. రైతుకు గౌరవం, భద్రత, స్థిరమైన ఆదాయం కల్పించడమే నిజమైన రైతు సంక్షేమం. అన్నదాత బలంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితేనే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. అందుకే రైతును ఓటు బ్యాంకుగా కాకుండా దేశ నిర్మాణంలో కీలక భాగస్వామిగా చూడాల్సిన సమయం వచ్చింది. రైతు చెమటకు విలువ దక్కిన రోజే వ్యవసాయానికి నిజమైన పండుగ. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# చెత్త నిర్వహణకు కొత్త ప్లాన్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ పెను సవాలుగా మారుతోంది. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి తరలించడమే కాకుండా, మూలాల వద్ద వేర్వేరుగా విభజించిన వ్యర్థాలు చివరి దశ వరకు అదే విధంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. సేకరణ, రవాణా, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, ప్రాసెసింగ్ కేంద్రాలు, తుది పారవేత వరకు ప్రతి దశలో చెత్త కలవకుండా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని నిపుణులు సూచిస్తున్నారు. మౌలిక వసతులు కల్పించకుండా సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలు చేయలేని అధికారులు 2026 రూల్స్ అమలు చేయడం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ప్రతిపాదిత మార్పులు, శాస్త్రీయ పద్ధతుల్లో చెత్తను నిర్వహించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2026 నేపథ్యంలో క్యూర్ పరిధిలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను సమూలంగా పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరముందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఉన్న వ్యవస్థలో చిన్నచిన్న మార్పులు చేయడం కంటే, క్యూర్ పరిధిలో ప్రతి దశకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

**ప్రతి దశలోనూ వేర్వేరుగా..**

శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు మూలాల వద్ద చెత్తను వేర్వేరుగా విభజించడమే ముఖ్యం. అయితే, ఇళ్ల వద్ద తడి, పొడి, ఇతర వ్యర్థాలను వేరు చేసినప్పటికీ, సేకరణ, రవాణా సమయంలో అవి కలిసిపోతే ఆ ప్రక్రియకు ప్రయోజనం ఉండదు. అందువల్ల చెత్త సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలోనూ వేర్వేరుగా నిర్వహించేలా వ్యవస్థను రూపొందించాల్సిన అవసరముంది.

**తడి, శానిటరీ వ్యర్థాలకు..**

తడి చెత్త, శానిటరీ వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం చెత్త సేకరణ వాహనాల్లో రెండు ప్రత్యేక కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పొడి చెత్త, ప్రత్యేక జాగ్రత్తలతో నిర్వహించాల్సిన వ్యర్థాల కోసం ప్రత్యేక సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి రకం చెత్తను ప్రతిరోజూ సేకరించేందుకు పెద్ద సంఖ్యలో వాహనాలను వినియోగించే బదులుగా, పొడి చెత్త, ప్రత్యేక వ్యర్థాల కోసం ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలి. క్యూర్ పరిధిలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను ఆధునికీకరించడం మరో కీలకమైన అంశం. ప్రతి ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో తడి చెత్త, శానిటరీ వ్యర్థాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. పొడి చెత్త నిర్వహణలో డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్లు (డీఆర్‌సీలు), మెటీరియల్ రికవరీ ఫెసిలిటీలు (ఎంఆర్‌ఎఫ్‌లు) కీలకంగా మారనున్నాయి. ప్రత్యేక వాహనాల ద్వారా సేకరించిన పొడి చెత్తను ఈ కేంద్రాలకు తరలించి, అక్కడ స్వీకరించడం, వేరు చేయడం, పునర్వినియోగ పదార్థాలను వెలికితీయడం, బేళ్లుగా కట్టడం, ఇతర పద్ధతల్లో ప్రాసెసింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతోపాటు రీసైక్లింగ్ చేసే సంస్థలకు పంపించాల్సి ఉంటుంది. దీంతో డంపింగ్ యార్డులు, తుది పారవేత కేంద్రాలకు చేరే చెత్త పరిమాణం తగ్గుతుంది.

**ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు**

క్యూర్ పరిధిలో సర్క్యులకర్ ఎకానమీలో భాగంగా చెత్త సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు పర్యవేక్షించడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రాథమిక చెత్త సేకరణ, రవాణా, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, ప్రాసెసింగ్ కేం ద్రాలను వేర్వేరు విభాగాలుగా కాకుండా ఒకే సమగ్ర వ్యవస్థలో భాగంగా చూడాల్సిన అవసరం ఉందని నిపుణులు కోరుతున్నారు. ప్రతి వార్డులోని కాలనీలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, నివాస ప్రాంతాలన్నింటినీ ఈ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు డిజిటల్ మ్యాపింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. తద్వారా ఏ ప్రాంతంలో ఎప్పుడు చెత్త సేకరిస్తారనే సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

**10 వేల ఈవీ వాహనాలు**

ఇంటింటి చెత్త సేకరణ, తరలింపు కోసం క్యూర్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీల కోసం 10 వేల ఈవీ ఆటో టిప్పర్లను రాంకీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అయితే నాలుగు బిన్స్ కాకుండానే రెండు బిన్స్ ద్వారానే చెత్త సేకరణ సమగ్రంగా నిర్వహించడానికి అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు. నాలుగు బిన్స్ ద్వారా చెత్తను వేరుచేయడమంటే సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ తడి, శానిటరీ వ్యర్థాల కోసం వార్డుకు 15 నుంచి 20 వాహనాలను ఏర్పాటు చేయడంతోపాటు పొడి, ఈ-వేస్ట్ సేకరణకు ఐదు వాహనాలు పెడితే సరిపోతుందని నిపుణులు అంచనా వేశారు. ప్రతిరోజూ తడి, శానిటరీ వ్యర్థాలను సేకరించడంతోపాటు పొడి, ఈ-వేస్ట్‌ను మాత్రం వారంలో ఏరియాల వారీగా నిర్వహిస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు.



# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యుద్ధం

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** దేశ ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల జగ్గారెడ్డి దీక్ష చేపట్టారు. సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి 10 గంటలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు సంఘీభావ దీక్షను ప్రారంభించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ చేపట్టిన పోరాటానికి మద్దతుగా ఈ దీక్ష నిర్వహిస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల విషయంలో తలెత్తుతున్న వివాదాలపై ఎన్నికల కమిషన్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ రాజకీయ పోరాటం కాదు.. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడే పోరాటం. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారు" అని జగ్గారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని, ఆయన పోరాటం కొనసాగినంతకాలం సంగారెడ్డిలో తమ దీక్ష కూడా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన ఖండించారు. నెహ్రూ--గాంధీ కుటుంబం ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చిందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు కోల్పోయారని, సోనియా గాంధీ సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో సేవలందించారని గుర్తుచేశారు. త్యాగాల చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ ప్రస్తుతం ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాడుతున్నారని అన్నారు. దీక్షలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ , టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సి డి సి చైర్మన్ రామిరెడ్డి నాయకులు మనిపల్లి సత్యనారాయణ, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# అరచేతిలోనే వ్యవసాయ సలహాలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సేవలు అందుతున్నప్పటికీ.. ఇప్పుడు చేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే మరిన్ని వ్యవసాయ సమస్యలకు సలహాలు, సమాచారం అందించే మరో వేదిక అందుబాటులోకి వచ్చింది. పంటకు తెగులు సోకినా, ఎరువు ఎంత మోతాదులో వేయాలో సందేహం వచ్చినా, ప్రభుత్వ పథకం అందకపోయినా రైతులు 1800-180-1551 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని పొందవచ్చు. తెలుగులోనే సలహాలు, సందేహాల నివృత్తి అందించడం ఈ సేవలో ప్రత్యేకత. అధికారుల సమాచారం ప్రకారం.. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2004 నుంచి దేశవ్యాప్తంగా అమలవుతున్న కిసాన్ హెల్ప్‌లైన్ సెంటర్ (కేహెచ్‌సీ) తెలంగాణ రైతులకు సేవలు అందిస్తోంది. హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనర్, సంచాలకుల కార్యాలయంలో ఈ కేంద్రం పనిచేస్తోంది.

**ప్రభుత్వ పథకాలపై సమాచారం**

పంటలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాంకేతిక సాగు పద్ధతులపై రైతులకు కేహెచ్‌సీ ద్వారా సలహాలు అందుతాయి. శాస్త్రవేత్తల మార్గదర్శకత్వంలో పంటలకు సంబంధించిన సందేహాలపై రైతులకు సూచనలు పొందే అవకాశం ఉంది. అలాగే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, మార్కెట్ ధరలకు సంబంధించిన సమాచారాన్ని కూడా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, వాటి ప్రయోజనాలు, వాటికి సంబంధించిన సందేహాలను కూడా రైతులు హెల్ప్‌లైన్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. ఏదైనా పథకం అందకపోయినా, సంబంధిత సమస్యను ఇదే నంబర్ ద్వారా తెలియజేసే అవకాశం ఉంది.

**ఫిర్యాదుల పరిష్కారానికి వేదిక**

సలహాలు, సమాచారంతో పాటు వ్యవసాయ పథకాలకు సంబంధించిన రైతుల ఫిర్యాదులను కూడా కేహెచ్‌సీ ద్వారా నమోదు చేసుకోవచ్చు. 'రైతుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' ఇదే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉండగా, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో కేంద్రం సహాయపడుతుంది. పశువుల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన అంశాలపైనా సలహాలు అందుతాయి. వాతావరణ శాఖ సూచనల మేరకు వాతావరణ పరిస్థితులు, విపత్తులకు సంబంధించిన హెచ్చరికలు, సమాచారాన్ని కూడా రైతులు పొందవచ్చు. కేంద్ర ఎరువుల యాప్‌కు సంబంధించిన సాంకేతిక సందేహాల నివృత్తికి కూడా ఈ సేవ ఉపయోగపడుతుంది.

**ఏడు రోజులూ అందుబాటులో**

రైతుల కోసం కిసాన్ హెల్ప్‌లైన్ సేవలు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, వారంలో ఏడు రోజులూ అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లోని రైతులకు ఈ సేవలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. ఈ టోల్‌ఫ్రీ సేవలు ప్రతి రైతుకూ తెలిసేలా క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), మండల వ్యవసాయ అధికారులు (ఎంఏఓలు) విస్తృతంగా ప్రచారం చేయాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డా.బీ.గోపి, ఐఏఎస్ సూచించారు. రైతులు తమ వ్యవసాయ సందేహాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# 12శాతం కమీషన్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అధికారపార్టీలో మెజార్టీ ఎమ్మెల్యేలు ఈజీగా డబ్బులు సంపాదించే మార్గాన్ని ఎంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సులభంగా సంపాదించేందుకు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించేందుకు పోటీలు పడుతున్నారు. అందుకు ప్రతిగా ఒక్కో బిల్లులో 12శాతం పైగానే కమీషన్లు తీసుకుంటున్నట్టు సమాచారం. చాలా సులువుగా డబ్బులు వస్తుండటంతో ఎమ్మెల్యేలే కాంట్రాక్టర్ల వద్దకే వెళ్లి, పెండింగ్ బిల్లులు ఇప్పిస్తామని బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఈ దందాను గమనించిన సీఎం రేవంత్ రెడ్డి అదే పనిగా బిల్లుల కోసం వస్తోన్న ఎమ్మెల్యేలను దూరం పెట్టినట్టు తెలుస్తున్నది.

**కాంట్రాక్టర్ల చుట్టూ ఎమ్మెల్యేల చక్కర్లు..**

ఎలాంటి పెట్టుబడిలేని, నష్టభయం ఉండని, పెద్దగా కష్టపడాల్సిన పనిలేని దందా ఏమైనా ఉందంటే ప్రభుత్వం నుంచి బిల్లులు ఇప్పించడమేనని ప్రచారం జరుగుతున్నది. ఈ దందాలో మొన్నటి వరకు మంత్రులు, ఐఏఎస్‌లకు నమ్మకస్తులైన మీడియేటర్స్ చేతుల మీదుగా పని జరిగేది. కానీ కొన్ని నెలలుగా కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బిల్లులు ఇప్పించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. దీనితో ఎమ్మెల్యేల మధ్య పోటీ ఏర్పడి, బిల్లులు ఇప్పిస్తామని కాంట్రాక్టర్లకు ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నట్టు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేలైతే నేరుగా కాంట్రాక్టర్ల ఇంటికి వెళ్లి, బిల్లులు ఇప్పిస్తామని బేరాలు చేసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. 'గతంలో బిల్లులు ఇప్పించాలని ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ కాంట్రాక్టర్లు తిరిగేవారు. కానీ ఇప్పుడు ఈజీగా డబ్బులు వస్తుండటంతో ఎమ్మెల్యేలే కాంట్రాక్టర్లను పట్టుకునే పనిలో ఉన్నారు' అని ఓ సీనియర్ మంత్రి కామెంట్ చేశారు. నెలలో ఓ ఐదు కోట్ల బిల్లు ఇప్పిస్తే సదరు కాంట్రాక్టర్ నుంచి రూ. అరకోటి పైగానే కమీషన్ వస్తుండటంతో ఎమ్మెల్యేలు బిల్లులు రిలీజ్ చేయించడంపైనే ఎక్కువగా ఫోకస్ పెడుతున్నారని టాక్. ఈ పోటీలో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్కేలు ఒకే కాంట్రాక్టర్‌తో బేరాలు కుదర్చుకుని సగం సగం డబ్బులు సైతం పంచుకున్న సందర్భాలు ఉన్నట్టు తెలిసింది.

**మంత్రులకు 20 కోట్లు, ఎమ్మెల్యేలకు 10 కోట్లు?**

ప్రభుత్వంలో నిధుల కొరత కారణంగా వివిధ శాఖల్లో చేసిన కాంట్రాక్టు పనులకు ఆలస్యంగా బిల్లులు విడుదల చేస్తున్నారు. దీనితో కాంట్రాక్టర్లు మధ్యవర్తులను ఆశ్రయించి, వారు అడిగినంత కమీషన్లు ఇచ్చి, తొందరగా బిల్లులను రిలీజ్ చేయించుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంలోని కీలక నేతల వద్ద పంచాయితీ చేసినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. తమ శాఖ, నియోజకవర్గం పరిధిలోని కాంట్రాక్టు పనులకు సంబంధించిన బిల్లులను తమ సిఫారసుతోనే రిలీజ్ చేయించాలని ఒత్తిడి పెట్టినట్టు తెలిసింది. అందుకు కాంగ్రెస్ అధిష్టానం సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రతినెల మంత్రుల కోటాలో రూ.20 కోట్లు, ఎమ్మెల్యేల కోటాలో రూ.10 కోట్ల బిల్లుల రిలీజ్ చేయించుకునే వెసులబాటు ఇచ్చినట్టు సమాచారం. దీనితో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గం పరిధిలోని బిల్లులు ఇప్పించేందుకు సిఫారసు లెటర్లు ఇస్తే ఇబ్బంది లేదు. కానీ ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గంలోని కాంట్రాక్టు పనులకు బిల్లులు ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డిపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది.

**సీఎం సీరియస్ వార్నింగ్**

కొందరు ఎమ్మెల్యేలు అదే పనిగా బిల్లుల రిలీజ్ చేయిండంపైనే ఫోకస్ పెడుతున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఒకట్రెండుసార్లు చూసీచూడనట్టుగా వ్యవహరించిన సీఎం మూడోసారి మాత్రం ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నట్టు తెలిసింది. అయినా కొందరు ఎమ్మెల్యేల్లో మార్పు రాకపోవడంతో సదరు ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదని టాక్ ఉంది.

'నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు శ్రద్ధ పెట్టడం లేదు. కేవలం బిల్లుల రిలీజ్ కోసమే నా వద్దకు వచ్చే ఎమ్మెల్యేలు ఉన్నారు. అలాంటి ఎమ్మెల్యేలను కలవాలంటే ఇబ్బందిగా ఉంది' అంటూ సీఎం రేవంత్ కొందరు సీనియర్ మంత్రుల వద్ద కామెంట్ చేసినట్టు తెలిసింది.




# జాతీయ రహదారిపై ధర్నా

**మందమర్రి,ఫ్లాష్ ఇండియా :** ఓట్ల తొలగింపు చర్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మందమర్రి పాత బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర కార్మిక, గనుల ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే చర్యలను సహించబోమని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. 'ఓటు చోరీ'పై మాట్లాడిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టు పిరికిపంద చర్య అని మంత్రి విమర్శించారు. ప్రశ్నించిన వారిని అరెస్టు చేస్తూ పోతే దేశంలో ఎంతమందిని అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని అన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ భద్రత పెంపు..



**ఢిల్లీ :** ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయనకు భద్రత పెంచుతూ గురువారం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయనకు జెడ్ ప్లస్ భద్రత కల్పించింది. ఇప్పటికే ఆయనకు వీఐపీ భద్రత ఉంది. దీనిని జెడ్ ప్లస్‌కు పెంచింది. ఢిల్లీతోపాటు ఆగ్రాలోని ఆయన నివాసం వద్ద నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దాంతో ఢిల్లీ, ఆగ్రాలోని ఆయన నివాసాలు, ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వద్ద సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్‌తోపాటు ఢిల్లీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు భద్రతా కారణాల దృష్ట్యా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఛత్తీస్‌గఢ్ పర్యటన అర్ధాంతరంగా వాయిదా పడింది. ఆయన రెండు రోజుల పాటు ఆ రాష్ట్రంలో పర్యటించాల్సి ఉంది. కానీ ఆయన పర్యటన హఠాత్తుగా వాయిదా పడింది. మళ్లీ ఈ పర్యటన ఎప్పుడు అనేది తర్వాత ప్రకటిస్తామని ఈసీ కార్యాలయం వెల్లడించింది. ఇంకో వైపు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, కాక్రోచ్ జనతా పార్టీ దేశంలోని వివిధ నగరాల్లో ఆందోళనలు, ర్యాలీలు చేపడుతున్న సంగతి తెలిసిందే.

# టీబీ రహిత గ్రామాలుగా ఐదు గ్రామాలు





**పెద్దపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** టిబీ నిర్మూలనలో ఎలిగేడు మండలం విశేష ఫలితాన్ని సాధించింది. టిబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఐదు గ్రామాలు టిబీ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాయి. నర్సాపూర్, ర్యాకల్ దేవ్‌పల్లి, లోకపేట, రాములపల్లి, నారాయణపల్లి గ్రామాలు ఈ ఘనతను సాధించాయి. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాములు ఆయా గ్రామాల ప్రతినిధులకు ప్రశంస పత్రాలను అందజేశారు. గ్రామాల్లో క్షయ వ్యాధి నియంత్రణకు చేపట్టిన చర్యలు, ప్రజలకు కల్పించిన అవగాహన, అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించడం వంటి చర్యల ఫలితంగా ఈ గుర్తింపు లభించింది. టిబీ నిర్మూలన కోసం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేశారు. గ్రామాల్లో టిబీ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అనుమానిత కేసులను గుర్తించి వైద్య పరీక్షలకు తరలించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి అవసరమైన చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. ఐదు గ్రామాలు ఒకేసారి టిబీ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందడం ఎలిగేడు మండలానికి గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలను అభినందించారు. టిబీ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందినప్పటికీ అప్రమత్తతను కొనసాగించాలని అధికారులు సూచించారు. టిబీ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని, గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. టిబీని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎలిగేడు మండలంలోని ఐదు గ్రామాలకు ఒకేసారి టిబీ రహిత గ్రామాలుగా గుర్తింపు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సాధించిన గుర్తింపును భవిష్యత్తులోనూ నిలబెట్టుకునేందుకు మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిస్సీ క్రిస్టియన, సర్పంచులు పల్లెర్ల వెంకటేష్ గౌడ్, మద్దెల రమాదేవి సంపత్, రంగు లత శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పూసుకుపల్లి-3 ఇసుక రీచ్‌లో అక్రమ వసూళ్ల దందా?

**లారీకి రూ.2700 వందల నుంచి రూ.3 వేల వరకు వసూళ్లు?**

**టీఎస్ఎండీసీ అధికారుల తీరుపై లారీ యజమానుల అనుమానాలు**



**మహదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పూసుకుపల్లి-3 ఇసుక రీచ్‌లో అక్రమ వసూళ్ల వ్యవహారంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరుగుతోందని, రీచ్‌కు వచ్చే లారీల నుంచి లోడింగ్ పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ పలువురు లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. ఒక్కో లారీకి రూ. 2700 వందల నుంచి రూ. 3 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని లారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా చెల్లించాల్సిన రుసుములతో పాటు ఈ అదనపు వసూళ్లు ఎందుకు చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అధికారుల కనుసన్నల్లోనేనా?**

రీచ్‌లో జరుగుతున్న వ్యవహారాలపై సంబంధిత తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) అధికారుల పర్యవేక్షణపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల దృష్టికి రాకుండానే ఈ స్థాయిలో అదనపు వసూళ్లు కొనసాగడం ఎలా సాధ్యమవుతుందన్న చర్చ లారీ యజమానుల్లో జరుగుతోంది. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారులు ఇప్పటివరకు అధికారికంగా స్పందించాల్సి ఉంది.

**వాహనాల సంఖ్య పెరిగినా.. వసూళ్లు ఆగడం లేదంటూ ఆరోపణలు**

పూసుకుపల్లి-3 రీచ్‌కు నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తున్నప్పటికీ, అదనపు వసూళ్లపై ఫిర్యాదులు మాత్రం ఆగడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు. రీచ్‌లో జరుగుతున్న లోడింగ్, వాహనాల ప్రవేశం, ఇసుక తరలింపు ప్రక్రియపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు కోరతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

పూసుకుపల్లి-3 ఇసుక రీచ్‌లో అదనపు వసూళ్లపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని లారీ యజమానులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే సంబంధిత విషయాన్ని అధికారికంగా స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇసుక రీచ్‌లో జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## ఎస్టీ గ్రామాల రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలి



**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్ మండల,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

చౌడాపూర్ మండల కేంద్రంలో అత్యధిక ఎస్టీ జనాభా నివసిస్తున్న గ్రామపంచాయతీలు, తండాలు నేటికీ సరైన అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మైసమ్మ టెంపుల్ నుంచి గుబ్బడి తండా, ఇర్లవాక్ తండా, హరిహనాయక్ తండా మీదుగా జాగారం వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా అధ్వాన్నంగా మారిందని తెలిపారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతిరోజూ ఈ ప్రాంతాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించాల్సి ఉంటుందని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ఎప్పుడు ప్రమాదానికి గురవుతామోనని భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రంలోని ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చినా, రహదారి దుస్థితి కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ఈ గ్రామాలు, తండాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. మైసమ్మ టెంపుల్ నుంచి హరిహనాయక్ తండా, ఇర్లవాక్ తండా, గుబ్బడి తండా మీదుగా జాగారం వరకు రహదారిని తక్షణమే పరిశీలించి, నాణ్యమైన రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారి సమస్యను ఇకపై నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోరారు.

## కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ సురేష్, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్ వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచుగా నమోదయ్యే నేరాలు, గ్రామాల పరిస్థితి, శాంతిభద్రతలు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్లో ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, వారి కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించిన ఎస్పీ,గారు రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్ కావడంతో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ర్యాలీ రాస్తారోకో



**గూడూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

గూడూరు మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఏఐసీసీ టిపిసిసి పిలుపుమేరకు మరియు డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమా. ఎమ్మెల్యే మురళి నాయక్ ఆదేశాల మేరకు గూడూరు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్. ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ సునీత కొమ్మలు నాయక్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని దేశ రాజధానిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ. ప్రియాంక గాంధీ లపై పోలీసులు బల ప్రయోగం చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గూడూరు మాజీ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్టే వెంకన్న. మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి. గూడూరు ఉప సర్పంచ్ చంటి స్వామి. మర్రి మిట్ట సర్పంచ్ పూర్ణచందర్. జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎం డి రసూల్. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కందిక శంకర్. చిన్న ఎల్లాపురం ఉపసర్పంచ్ వెంకటరామ్. నాయకులు మాలు నాయక్. పొన్నం వెంకన్న. సురేందర్. ముత్యం లక్ష్మీనారాయణ. మాజీ సర్పంచ్లు ఉప సర్పంచ్లు గ్రామపంచాయతీ అధ్యక్షులు యూత్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధైర్యపురి తండాలో మహిళా సంఘ భవనం ప్రారంభం



**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

ధైర్యపురి తండాలో VBGRAMG నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతం ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. మహిళలు పొదుపు, రుణాలు, చిన్న తరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని, ఇందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళా సంఘాల భవనాలు అందుబాటులోకి రావడంతో సమావేశాలు, శిక్షణలు, సంఘ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, మహిళల సంక్షేమం, పేదల ఆర్థిక పురోగతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలు అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దొంతం అలివేలు సంజీవరెడ్డి, జాటావత్ హరినాయక్, ముచర్ల గిరి, ఎరుకల వెంకటయ్య గౌడ్, కొండూరు పవన్ కుమార్, కాశగోని వెంకటయ్య, అనంతుల శ్రీను గౌడ్, వాంకుడోత్ అనిత, దాసు, అంగిరేకుల నాగభూషణం, వాంకుడోత్ రవి నాయక్, మాస భాస్కర్, జంగిటి నర్సింహా, యాచారపు యాదిగౌడ, గుండ్లపల్లి నర్సిరెడ్డి, కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, గుణమోని కొండల్ యాదవ్, మహ్మద్ ఖలీల్, అధికారులు, మార్కెట్ డైరెక్టర్లు, మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఉరివేసుకొని యువకుడు మృతి

**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం ఏదుల్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... వలిగొండ మండల పరిధిలోని ఏదుల్లగూడెం గ్రామ శివారులో నోముల రామచంద్ర వ్యవసాయ భూమిలో ఉన్న వేప చెట్టుకు జంగిటి కర్ణాకర్(25) స్వస్థలం వసంతపురం గ్రామం, రాజాపేట మండలం, అను యువకుడు చున్నీతో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడు ఇంటర్ వరకు చదివి, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచుగా మద్యం సేవించేవాడని, మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినప్పటికీ వినేవాడు కాదని మృతుడి తండ్రి జంగిటి బిక్షపతి తెలిపాడు. రెండు రోజుల క్రితం మద్యం సేవించడానికి డబ్బులు అడగగా తండ్రి డబ్బులు లేవని మందలించడంతో తన సెల్‌ఫోన్‌ను విక్రయించి మద్యం సేవించినట్లు, అనంతరం కొత్త సెల్‌ఫోన్ కొనుగోలు చేయడానికి డబ్బులు అడగగా కుటుంబ సభ్యులు డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురై ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. ఇట్టి సంఘటనపై మృతిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వలిగొండ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ మిర్యాలగూడలో కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ...

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ఢిల్లీలో నిర్వహించిన "సేవ్ డెమోక్రసీ -- ఓట్ బచావో -- దేశ్ బచావో"కార్యక్రమంలో భాగంగా, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలతో కలిసి కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మోడీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎమ్మెల్యే బిఎల్ఆర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కు అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత,నిష్పక్షపాతత్వం ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,యువజన నాయకులు,బిఎల్ఆర్ బ్రదర్స్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం



**నల్లగొండ జిల్లా/దేవరకొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం దేవరకొండ పట్టణంలోని SPR స్కూల్, బ్రిలియంట్ బాచ్‌పన్ స్కూల్‌లను సందర్శించి పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ఫారాలను ఉపాధ్యాయులకు అందజేసి, అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు నవంబర్ 6వ తేదీలోపు ఎన్రోల్మెంట్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి దేవరకొండ నియోజకవర్గ ఎన్రోల్మెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్, బీజేపీ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నరసింహ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణతో పాటు, అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు, పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నవంబర్ 6లోపు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ పూర్తి చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ దేవరకొండ నియోజకవర్గ కో-కన్వీనర్ జల్ల భాస్కర్, వనం జగదీశ్వర్, చిలక రాజు, బిక్కు ఎర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## నాయకపల్లి సర్పంచ్ గుండెల వీరన్న కు సన్మానం



**గూడూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

మానుకోట జిల్లా కేంద్రంలో ఐ డి ఓ సి నందు క్షయరహిత సమాజం అందరి లక్ష్యమని జిల్లా టిడిపి ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్జున్ పేర్కొన్నారు టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో కలిసి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఆవిష్కరించిన జోష్ ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడుతూ టీబికి అన్ని రకాల పరీక్షలు చికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభిస్తుందని టీబి వ్యాధిగ్రస్తులకు ప్రతినెల ప్రభుత్వం వెయ్యి రూపాయల పోషక ఆహారం అందిస్తుందని ప్రతి ఒక్కరు టీబి పై అవగాహన కలిగి ఉండాలని టీబీని అంతం చేసేందుకు జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచులు భాగస్వాములు కావాలని జిల్లాలో టీబి రహిత గ్రామపంచాయతీలుగా 13 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని అందులో నాయకపల్లి గ్రామం ఎంపికైనందున గ్రామ సర్పంచ్ గుండెల వీరన్న ను జిల్లా అధికారులు శాలువాతో సన్మానించి మెమొంట్ అందజేసి టీబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేయాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీడీవో బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్,విగణేష్, భాస్కర్, నీలిమ, శ్వేత, అశోక్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోహిత్, విరాట్ బాటలోనే భువీ..



న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ భారత జట్టులోకి ఎంపిక కావడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చివరిసారిగా 2022లో టీమిండియా జట్టులో కనిపించిన భువీ, సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చారు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున వరుసగా 2025, 2026 సీజన్లలో అద్భుతమైన ప్రదర్శన చేసి ఆర్సీబీ టైటిళ్లు గెలవడంలో కీలక పాత్ర పోషించడంతో ఆయనకు ఈ అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై భారత మాజీ ఓపెనర్ సదాగోప్షన్ రమేష్ పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు.

**వయస్సు కంటే ప్రదర్శనే ముఖ్యం..**

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన సదాగోపన్ రమేష్, "నాలుగేళ్ల తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకోవడం అత్యంత అద్భుతం. వయస్సు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు తమ ప్రదర్శన ద్వారా ఇప్పటికే నిరూపించారు. దాంతో బీసీసీఐ, సెలెక్టర్ల ఆలోచనా విధానంలో స్పష్టమైన మార్పు వచ్చింది" అని అన్నారు. వయస్సును మాత్రమే ప్రామాణికంగా చూసిన నాటి చీఫ్ సెలెక్టర్ (అగార్కర్) తొలగిపోయిన తర్వాత, కొత్త సెలెక్షన్ కమిటీకి పూర్తి స్వేచ్ఛ లభించిందని, అందుకే వారు వయస్సు కంటే ప్రదర్శనకే ప్రాధాన్యమిచ్చి భువనేశ్వర్‌ను ఎంపిక చేశారని రమేష్ వ్యాఖ్యానించారు. "ఆర్సీబీ వరుసగా టైటిళ్లు గెలవడంలో భువీ స్వింగ్ బౌలింగ్ అత్యంత కీలకంగా నిలిచింది. అతను ఎంతటి అద్భుతమైన ఫిట్‌నెస్‌తో ఉన్నాడో అతని ప్రదర్శనే చెప్పకనే చెప్పింది. అతని రీఎంట్రీ కోసం అభిమానులంతా వేచి చూశారు. చివరికి వారి ప్రార్థనలు ఫలించాయి" అని పేర్కొన్నారు.

**మహమ్మద్ షమీకి కూడా దారి సుగమం..**

భువనేశ్వర్ కుమార్ పునరాగమనం విజయం సాధిస్తే, అది మరొక అనుభవజ్ఞుడైన పేసర్ మహమ్మద్ షమీకి కూడా ద్వారాలు తెరుస్తుందని రమేష్ అభిప్రాయపడ్డారు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత భారత్ తరఫున ఆడని షమీకి ఈ పరిణామం మళ్లీ అవకాశం దక్కేలా చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# హర్మన్ ప్రీత్ కౌర్ బాటలో శ్రీలంక కెప్టెన్ ధనంజయ



భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తన పదవికి రాజీనామా చేస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అకస్మాత్తుగా ఆమె తీసుకున్న ఈ నిర్ణయంతో క్రీడ వర్గాలు విస్మయానికి గురయ్యాయి. తాజాగా పురుషుల విభాగంలో శ్రీలంక టెస్ట్ క్రికెట్ జట్టు కెప్టెన్ ధనంజయ డి సిల్వ కూడా సంచలన నిర్ణయం తీసుకున్నాడు. నాయకత్వ బాధ్యతల నుంచి తక్షణమే తప్పుకొంటున్నట్లు ఇవాళ (గురువారం) ప్రకటించాడు. శ్రీలంక సెలక్షన్ కమిటీకి ధనంజయ్ రాసిన లేఖలో పలు అంశాలను పేర్కొన్నాడు. కొత్త తరానికి కెప్టెన్సీ బాధ్యతలు అందజేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాన్ని తాను మనస్ఫూర్తిగా తీసుకున్నానని ధనంజయ డి సిల్వ వెల్లడించాడు. నాయకుడిగా వైదొలిగినప్పటికీ ఆటగాడిగా మాత్రం జట్టులో కొనసాగుతానని ఈ సందర్భంగా స్పష్టం చేశాడు. ధనంజయ డి సిల్వ నిర్ణయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు స్వాగతించింది. లంక క్రికెట్ సీఈఓ ఆష్లే డి సిల్వ మాట్లాడుతూ.. 'డి సిల్వ భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటున్నాం. మా టెస్టు జట్టుకు నాయకుడిగా సేవలు అందించినందుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నాడు. 1991లో కొలంబోలో జన్మించిన డి సిల్వ 2015లో శ్రీలంక తరఫున అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టాడు. ఇప్పటి వరకు 69 టెస్టులు, 93 వన్డేలు, 48 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ధనంజయ టెస్టుల్లో 4431, వన్డేల్లో 1924, టీ20లలలో 890 పరుగులు సాధించాడు. అదే విధంగా.. టెస్టుల్లో 43, వన్డేల్లో 48, టీ20ల్లో 17 వికెట్లు పడగొట్టాడు ఈ రైటార్మ్ ఆఫ్ బ్రేక్ స్పిన్నర్. డి సిల్వ 2024 జనవరిలో దిముత్ కరుణరత్నె నుంచి శ్రీలంక టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. మొత్తంగా 18 మ్యాచ్‌లలో సారథిగా వ్యవహరించి.. ఏడు టెస్టుల్లో జట్టును గెలిపించాడు. కెప్టెన్‌గా 1130 పరుగులు సాధించడంతో పాటు.. 44.44 బౌలింగ్ సగటుతో 9 వికెట్లు సాధించాడు. కాగా చివరిగా.. టీమిండియాతో ఈ ఏడాది జూలై-ఆగష్టులో జరిగిన టెస్టు సిరీస్ సందర్భంగా ధనంజయ డి సిల్వ లంక కెప్టెన్‌గా వ్యవహరించాడు.



# ముగిసిన అజిత్ అగార్కర్ పదవి కాలం..

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) సెలక్షన్ కమిటీ చీఫ్‌గా మాజీ క్రికెటర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ నెల 4వ తేదీతో అగార్కర్ పదవీకాలం ముగిసింది. వెంటనే ఖాళీగా ఉన్న సెలక్టర్ పదవి కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. కొత్తగా రాబోయే సెలక్టర్‌ని బట్టి తదుపరి చీఫ్ సెలక్టర్ ఎంపిక ఉండబోతోంది. ఈ క్రమంలో భారత సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా ఆసక్తికర పోస్టు పెట్టాడు. ప్రస్తుతం ఆ పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది.బీసీసీఐ దరఖాస్తుల నోటిఫికేషన్‌కు సంబంధించిన పోస్టును షేర్ చేసిన జడ్డూ .. 'ప్రాసెస్ ఏంటి?' అంటూ నవ్వుతూ ఉన్న ఎమోజీని జోడించాడు. దీంతో ఆ పోస్టుకు రవీంద్ర జడేజా ఏమైనా అప్లై చేసుకుంటాడా?పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. రెండేళ్ల క్రితం అగార్కర్ నాయకత్వంలోని సెలక్షన్ కమిటీ రవీంద్ర జడేజాను కొన్ని వన్డే సిరీస్‌లకు పక్కన పెట్టింది. అప్పుడు వీరిద్దరి మధ్య సంబంధాలు చెడినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే జడేజా తాజా పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ఏడాది ఆరంభంలో స్వదేశంలో జరిగిన ఆఫ్ఘానిస్థాన్ వన్డేలకు, యూకేలో జరిగిన ఇంగ్లాండ్ వన్డేలకు దూరమైన జడేజా, వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్ సందర్భంగా జట్టులోకి పునరాగమనం చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో కలిపి జడేజా 10 ఓవర్లలో 2/75, 0/54 బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. 2025 నుంచి ఆడిన తన చివరి 15 వన్డేలలో, జడేజా 10 ఇన్నింగ్స్‌లలో 29.80 సగటుతో 149 పరుగులు చేశాడు. అతని అత్యుత్తమ స్కోరు 32 కాగా, స్ట్రైక్ రేట్ 95కు పైగా ఉంది. ఈ ఆల్‌రౌండర్ 15 మ్యాచ్‌లో 47.93 సగటుతో 14 వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

# పంజాబ్ కింగ్స్‌కు కోచింగ్ స్టాఫ్ ఝలక్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కోచింగ్ స్టాఫ్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన ఆస్ట్రేలియా మాజీ ఆల్ రౌండర్ జేమ్స్ హోప్స్, ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ తమ పదవులకు రాజీనామా చేశారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో మెరుగైన అవకాశాలు రావడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. జేమ్స్ హోప్స్ క్వీన్స్‌లాండ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా బిగ్ బాష్ లీగ్ జట్టు 'బ్రిస్బేన్ హీట్'కు కూడా కోచ్‌గా ప్రధాన బాధ్యతలను నిర్వర్తించనున్నారు. రిక్కీ పాంటింగ్ హయాంలో ఆయన పంజాబ్ జట్టుతో పనిచేశారు. ఇక ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ అయిన బ్రాడ్ హాడిన్ న్యూ సౌత్ వేల్స్ పురుషుల జట్టుకు హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు.

**కొత్త కోచ్‌ల కోసం పంజాబ్ కసరత్తు..**

హెడ్ కోచ్ రికీ పాంటింగ్ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న ఈ ఇద్దరు సీనియర్ కోచ్‌లు తప్పుకోవడంతో, పంజాబ్ కింగ్స్ మేనేజ్‌మెంట్ సపోర్ట్ స్టాఫ్‌ను పూర్తి చేసే పనిలో పడింది. రాబోయే ఐపీఎల్ 2027 సీజన్ కోసం డిసెంబర్‌లో జరిగే మినీ వేలానికి ముందే ముగ్గురు కొత్త కోచ్‌లు అందుల ఓ భారతీయుడు, ఇద్దరు విదేశీ కోచ్‌లను నియమించాలని పంజాబ్ ఫ్రాంచైజీ భావిస్తోంది. ఈ నియామకాలకు సంబంధించి హెడ్ కోచ్ రికీ పాంటింగే తుది నిర్ణయం తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది.

# బీసీసీఐ ఆసక్తికర ట్వీట్



భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన మాజీ పేసర్ అజిత్ అగార్కర్ పదవీకాలం అధికారికంగా ముగిసింది. ఈ నేపథ్యంలో ఆయన భారత క్రికెట్‌కు అందించిన సేవలను కొనియాడుతూ భారత క్రికెట్ నియంత్రణ మండలి సోషల్ మీడియా వేదికగా ఓ స్పెషల్ ట్వీట్ చేసింది. అజిత్ అగార్కర్ 2023 జూలైలో టీమిండియా చీఫ్ సెలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఆయన తన బృందంతో కలిసి జట్టు ఎంపికలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ, భారత జట్టును అన్ని ఫార్మాట్లలోనూ బలంగా తీర్చిదిద్దడంలో తనదైన ముద్ర వేశారు.

**అగార్కర్ హయంలో అద్భుత విజయాలు..**

అగార్కర్ సెలెక్టర్ల కమిటీ చైర్మన్‌గా ఉన్న కాలంలో భారత జట్టు అసాధారణ ప్రదర్శన కనబరిచి పలు చారిత్రాత్మక విజయాలను నమోదు చేసిందని బీసీసీఐ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా మొత్తం 3 ఐసీసీ ట్రోఫీలు భారత్ సొంతమయ్యాయి. అదేవిధంగా 2 ఆసియా కప్ టైటిళ్లు, 2 ఏషియన్ గేమ్స్ గోల్డ్ మెడల్స్‌ను సాధించింది. ఇక అత్యంత ప్రతిష్టాత్మకమైన 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు టీమిండియా చేరుకుంది. భారత క్రికెట్ అభివృద్ధి కోసం అజిత్ అగార్కర్ చూపిన అంకితభావం, నిబద్ధతను బీసీసీఐ ప్రత్యేకంగా అభినందించింది.

# బిజినెస్

## భారత్‌లో స్టార్ లింక్‌ను అడ్డుకుంటున్నారు..



భారతదేశంలో తన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు స్టార్‌లింక్ ప్రవేశాన్ని కొందరు అపార సంపన్నులు కావాలనే అడ్డుకుంటున్నారని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎక్స్ వేదికగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం టెలికాం, వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. భారతదేశంలోని ప్రజలకు ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందకుండా చేసి, తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడానికే కొందరు దిగ్గజాలు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారని మస్క్ మండిపడ్డారు. ఆ దిగ్గజాలు ఎవరో ప్రజలే సులభంగా ఊహించుకోవచ్చుంటూ కామెంట్ చేసిన ఆయన.. భారత్‌లో స్టార్‌లింక్ రాకపోకలను నిలిపివేయడం అక్కడి ప్రజలకు చేస్తున్న నేరంతో సమానమని ఘాటుగా స్పందించారు.

**ఇంకా పెండింగ్‌లోనే క్లియరెన్స్‌లు..**

భారత్‌లో సేవలు అందించేందుకు స్టార్‌లింక్ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నప్పటికీ, భద్రతాపరమైన క్లియరెన్స్‌లు, స్పెక్ట్రమ్ కేటాయింపులు ఇంకా తుది దశకు చేరుకోలేదు. తమ వైపు నుంచి అన్ని అనుమతులకు సిద్ధంగా ఉన్నా, కొందరి స్వార్థ ప్రయోజనాల వల్ల ఈ ప్రక్రియలో విపరీతమైన జాప్యం జరుగుతోందని మస్క్ ఆరోపించారు. భారతీయ టెలికాం మార్కెట్లో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు ప్రారంభం కానున్న కీలక తరుణంలో ఎలాన్ మస్క్ చేసిన ఈ తాజా వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

**మస్క్ ట్వీట్‌పై స్పందించిన కేటీఆర్..**

అయితే, ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రియాక్ట్ అయ్యారు. భారత్‌లోకి స్టార్ లింక్ రాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఎవరు పట్టు బిగించారో దేశం తెలుసుకోవాలని అన్నారు. ఆ కుబేరుల పేర్లను మస్క్ బయటపెట్టాలని కేటీఆర్ కామెంట్ చేశారు.

# జనవరి వరకూ వాయిదా..!




మరో వారం రోజుల్లో అంటే అక్టోబర్ 15, 2026 నుంచి దేశవ్యాప్తంగా మర్చంట్ ట్రాన్సాక్షన్స్ అంటే షాపుల్లో చేసే చెల్లింపులపై యూపీఐ ఛార్జీలను వసూలు చేయాలని మోడీ సర్కార్ ఆదేశించింది. అయితే ఈ నిర్ణయంపై ఇప్పటికే అనేక వ్యాపార సంఘాలతో పాటు చిరు వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దీంతో చాలా మంది వర్తకులు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఎండీఆర్ ఛార్జీలను వచ్చే ఏడాది వరకూ ఆపాలని తాత్కాలికంగా వాయిదా కోరుతూ రిక్వెస్ట్ చేస్తున్నారు. యూపీఐ ఎండీఆర్‌అమలును వాయిదా వేయాలని కోరుతూ మర్చెంట్ అసోసియేషన్లు, ఫిన్‌టెక్ సంస్థలు విజ్ఞప్తి చేశాయి. విభిన్న ఎండీఆర్ రేట్లు, విధానాల వల్ల ఏర్పడిన గందరగోళం, పండుగ సీజన్ సమీపిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. దీనిపై ఆర్థిక మంత్రిత్వ శాఖతో చర్చలు జరుగుతుండగా, ఎన్‌పీసీఐ రాబోయే రెండు రోజుల్లో ఫైనల్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.గత నెలలో యూపీఐ స్టీరింగ్ కమిటీ రూ.2వేల కంటే ఎక్కువ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వసూలు చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం రూ.2వేల ఖర్చుపై రూ.8, అలాగే రూ.10వేల చెల్లింపులపై రూ.40 ఎండీఆర్ పడుతుంది. అయితే ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో, పండుగ సీజన్ సమయంలో ఈ ఛార్జీల వల్ల బిజినెస్ ఖర్చులు పెరిగి, వినియోగదారులపై భారం పడుతుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. వ్యాపారులు ఈ భారాన్ని పరోక్షంగా వినియోగదారులపైకి మళ్లించే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.కార్డులతో పోలిస్తే యూపీఐ లావాదేవీల నిర్మాణం చాలా క్లిష్టమైనది. కార్డ్ నెట్‌వర్క్‌ల మాదిరిగా కాకుండా.. యూపీఐలో యుటిలిటీ బిల్లులు, లోన్ రీపేమెంట్లు, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు వేర్వేరు రేట్లు ప్రకటించారు. లోన్ రీపేమెంట్లు, బ్రోకింగ్ ఖాతాలకు డబ్బులు జమ చేయడం వంటి వాటికి క్రెడిట్ కార్డులను రిజర్వ్ బ్యాంక్ అనుమతించదు. ఈ ప్రత్యేకమైన లావాదేవీలను ఎలా వర్గీకరించాలి, ఆటోపే ఫెయిల్ అయితే మాన్యువల్ పేమెంట్లకు వర్తించే నిబంధనలేమిటనే అంశాలపై బ్యాంకులు, పేమెంట్ అగ్రిగేటర్లలో స్పష్టత కొరవడింది.ఈ గందరగోళాన్ని తొలగించడానికి, పండుగ సీజన్ ముగిసే వరకు ఎండీఆర్ అమలును వాయిదా వేయాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. క్యాపిటల్ మార్కెట్లు కూడా బ్రోకింగ్ సంస్థలపై ఎండీఆర్ భారం మోపవద్దని వాదిస్తున్నాయి. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవడానికి తగినంత సమయం కావాలని వారు కోరుతున్నారు.ఎన్‌పీసీఐ ఈ అభ్యర్థనలపై సానుకూలంగా స్పందించి, త్వరలోనే స్పష్టత ఇస్తుందని భావిస్తున్నాయి పేమెంట్ సంస్థలు, బ్యాంక్స్.




# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

భారత స్టాక్ మార్కెట్లు రిజర్వు బ్యాంక్ వడ్డీ రేట్ల పెంపు ప్రకటన నాటి నుంచి నష్టాల్లో ట్రేడింగ్ కొనసాగిస్తున్నాయి. ఉదయం స్వల్ప నష్టాలతో ప్రయాణం మట్నదలుపెట్టిన స్టాక్ మార్కెట్ సూచీలు మధ్యాహ్నం నాటికి భారీ పతనానికి గురయ్యాయి. ఈ క్రమంలో 12.52 గంటల నాటికి సెన్సెక్స్ సూచీ 910 పాయింట్లు, నిఫ్టీ సూచీ 319 పాయింట్లు, నిఫ్టీ బ్యాంక్ 311 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 1088 పాయింట్లు కోల్పోయాయి.క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలకు తోడుగా మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు డబ్బు వెనక్కి తీసుకోవటం తోడవటంతో ఓలటాలిటీ పెరుగుతోంది. ఇదే క్రమంలో భారత సెంట్రల్ బ్యాంక్ ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచేయటం.. అమెరికా ఫెడ్ మినిట్స్ కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూడటం సూచీలను ఊహించని నష్టాల దిశగా నడిపిస్తోంది. ఈసారి కూడా వడ్డీ రేట్ల గురించి ఫెడ్ ఎలా ముందుకెళుతుందనే అంశంపై ఇన్వెస్టర్ల దృష్టి ప్రస్తుతం కొనసాగుతోంది. ఇదే క్రమంలో వ్యాపారుల రిక్వెస్ట్ మేరకు పేమెంట్స్ కార్పొరేషన్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖతో యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఛార్జీల అమలు వాయిదా చర్చల వార్తలు పేటీఎం, పైనా ల్యాబ్స్, మట్నబిక్విక్ లాంటి పేమెంట్ అగ్రికేషన్ స్టాక్స్ కుప్పకూలేలా చేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్లలోని అన్ని రంగాలు దాదాపు నష్టాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. మారుతున్న ఆర్థిక పరిస్థితులను పరిశీలిస్తూ ఇన్వెస్టర్లు ముందుకు సాగాలని మార్కెట్ నిపుణులు పెట్టుబడిదారులను ప్రస్తుతం హెచ్చరిస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు




వాహనదారులకు ముఖ్యమైన అప్‌డేట్. పెట్రోల్, డీజిల్ ధరల్లో ప్రతిరోజూ స్వల్ప మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో వాహనదారులు ఇంధనం ధరలపై ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలో ఈ రోజు (అక్టోబర్ 8) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**తెలంగాణలో ధరలు**

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఈ రోజు లీటర్ పెట్రోల్ ధర రూ.116.15గా ఉండగా.. డీజిల్ ధర రూ.104.23గా ఉంది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు తదితర కారణాలతో ఇంధన ధరల్లో స్వల్ప వ్యత్యాసం ఉండే అవకాశం ఉంది.

**ఆంధ్రప్రదేశ్‌లో ఇలా..**

ఆంధ్రప్రదేశ్‌లోనూ పెట్రోల్, డీజిల్ ధరలు నగరాన్ని బట్టి మారుతున్నాయి. విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర సుమారు రూ.117.95గా ఉండగా.. డీజిల్ ధర రూ.104.96గా ఉంది. విశాఖపట్నంలో పెట్రోల్ ధర రూ.116.53గా ఉండగా.. డీజిల్ ధర రూ.104.24గా నమోదైంది. తిరుపతిలో డీజిల్ ధర సుమారు రూ.105.46గా ఉంది.




## సస్పెన్స్‌కు తెర..

సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా విపరీతంగా ట్రెండ్ అవుతున్న క్రేజీ హారర్-కామెడీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే విడుదలైన 'జిమ్ జిమ్ తార' సాంగ్ సోషల్ మీడియాలో ఏకంగా సునామీ సృష్టించింది. రీల్స్‌లోనూ, యూట్యూబ్‌లోనూ ఈ పాటకు విపరీతమైన క్రేజ్ రావడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో తాజాగా, మేకర్స్ ఈ చిత్రానికి 'పర్ణశాల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఎస్ఎల్‌టీ ఫిలిమ్స్ బ్యానర్‌పై మంచి వెంకట్ నిర్మాణంలో, వై.జి. భరత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పూర్తిగా భయపెడుతూనే, కడుపుబ్బా నవించే హిలేరియస్ హారర్-కామెడీ రైడ్‌గా ఉండబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.




## అనుకున్నన్ని అవకాశాలు రాలేదు

'కేజీఎఫ్' మూవీతో ఓవర్ నైట్ స్టార్‌డెమ్ తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి, ప్రస్తుతం వెంకటేష్ హీరోగా వస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీ త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీనిధి.. తాను తక్కువ సినిమాలు చేయడానికి అసలు కారణం ఏంటో క్లారిటీ ఇచ్చింది. గత కొన్నేళ్లుగా తాను చాలా తక్కువ ప్రాజెక్ట్స్ చేస్తుండటంతో అందరూ సెలక్టివ్‌గా ఉంటుందని అనుకుంటున్నారని, కానీ నిజానికి తనకు కెమెరా ముందు నటించడం అంటే చాలా ఇష్టమని శ్రీనిధి తెలిపింది. మంచి ఆఫర్లు వస్తే ఏడాదికి నాలుగు, ఐదు సినిమాలు చేయడానికి కూడా తాను సిద్ధమేనని స్పష్టం చేసింది. అయితే తనకు తగినట్లుగా మంచి స్క్రిప్ట్, ఇంట్రెస్టింగ్ టీమ్ కుదిరితేనే ఆ ప్రాజెక్ట్‌లను ఓకే చేస్తానని చెప్పింది.కొన్నిసార్లు తన టైమింగ్ బాగోకపోవడం వల్ల కావచ్చు, లేదా మేకర్స్ తనను సరిగ్గా అంచనా వేయలేకపోవడం వల్ల కావచ్చు..అనుకున్నన్ని అవకాశాలు రాలేదని అభిప్రాయపడింది. తాను మంచి యాక్టర్ కాదేమో అని అందుకే అవకాశాలు ఇవ్వడం లేదనే భావన కలుగుతుందని చెప్పింది. తన గురించి తాను ఎప్పుడూ గొప్పగా ఊహించుకోనని, ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగానే ఉంటానని తెలిపింది. కొత్త డైరెక్టర్ అయినా, పెద్ద డైరెక్టర్ అయినా తనకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతానని, కేవలం సినిమాపై ఉన్న ప్యాషన్‌తోనే తన పని తాను చేసుకుంటూ వెళ్తానని శ్రీనిధి చెప్పుకొచ్చింది. ఇక వెంకటేష్ - త్రివిక్రమ్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా గురించి మాట్లాడుతూ.. ఈ గోల్డెన్ కాంబో మూవీలో తనకు ఛాన్స్ వస్తుందని కలలో కూడా అనుకోలేదంటూ సంతోషం వ్యక్తం చేసింది

## బాలీవుడ్‌లో అంతులేని విషాదం..




ప్రముఖ బాలీవుడ్ నటుడు నానా పటేకర్ హఠాన్మరణంతో సినీఅభిమానులు శోకసంద్రంలో కూరుకుపోయారు. గోవాలో దోనా పౌలా ప్రాంతంలోని తన నివాసంలో గురువారం ఆయన గుండెపోటుతో మరణించారు. సరిగ్గా నాలుగు రోజుల క్రితం ఆయన అన్నమాటలను అభిమానులు గుర్తు చేసుకుని కుమిలిపోతున్నారు. 'ఈ రోజు మీ ముందు ఉన్నా.. రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు..?' అని నానా పటేకర్ ఇటీవల ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. అక్టోబర్ 4న గోవాలో సామ్రాట్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నానా పటేకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవితంలో ఎన్నటికీ తప్పించలేని అనిశ్చితి గురించి మాట్లాడారు. రేపు ఏం జరుగుతోందో ఎవరికీ తెలియదని చెప్పారు. 'మనం ఇతరులకు వీలైనంత సేవ చేయాలి. ఎందుకంటే మనం వెంట తీసుకెళ్లేది ఏమీ ఉండదు. జీవితాన్ని ఎవరైనా సరే ఇలాగే గడపాలి' అని వ్యాఖ్యానించారు. ఆ కార్యక్రమంలో నానా పటేకర్ మనసులోని భావాలను యథాతథంగా పంచుకున్నారని మాజీ ఎంపీ నరేంద్ర సవైకర్ అన్నారు. ఇతరులపై సెటైర్లు పేల్చుతూ.. అక్కడి నాట్య బృందంతో కలిసి చిందేసి సరదాగా గడిపారని అన్నారు. నానా పటేకర్ మాటలు నిజమై ఆయన దూరం కావడంతో అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. కన్నీరమున్నీరవుతున్నారు.

## సమయం కేటాయించే సామర్థ్యం లేదు



తనదైన ప్రత్యేకమైన గొంతుతో, వైవిధ్యమైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న అర్జున్ దాస్.. సినిమాల పట్ల తనకున్న అంకితభావాన్ని బయటపెట్టారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా తన కెరీర్‌కు ఉన్న ప్రాధాన్యత గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. తనకు ఏ రోజైనా సరే బంధాల కంటే తన వృత్తే ముఖ్యమని అర్జున్ దాస్ స్పష్టం చేశారు. స్క్రిప్ట్‌లు వినడం, కొత్త పాత్రల స్వభావంలోకి పరకాయ ప్రవేశం చేయడం, కెమెరా ముందు నటించడం తనకు నిజమైన సంతోషాన్ని ఇస్తుందని ఆయన తెలిపారు. ఎవరితోనైనా బంధం కోసం తగినంత సమయం కేటాయించే ఆసక్తి గానీ, ఆ సామర్థ్యం గానీ తనలో ఉందో లేదో తనకే తెలియదని పేర్కొన్నారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి అంతా కేవలం సినిమాల మీదే, తన కెరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడం మీదే ఉందని అన్నారు.

## సేనాపతి తిరిగివస్తున్నాడు..



లోకనాయకుడు కమల్ హాసన్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ శంకర్ కలయికలో 1996లో వచ్చిన భారతీయుడు ఎలాంటి సంచలనాలు సృష్టించిందో చెప్పక్కర్లలేదు. ఆ తర్వాత 2024లో భారతీయుడకు సీక్వెల్ గా ఇండియన్ 2ను తీసుకువచ్చాడు శంకర్. కానీ భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బిగ్గెస్ట్ ఫ్లాప్ గా నిలిచింది. అసలే ఫ్లాప్స్ లో ఉన్న శంకర్ కు ఈ సినిమా మరింత నెగిటివిటీని తీసుకువచ్చింది. అయితే ఇండియన్ 2 టైమ్ లోనే ఈ సినిమాకు సిక్వేల్ గా భారతీయుడు 3 షూటింగ్ కూడా ఆల్మోస్ట్ ఫినిష్ చేసాడు శంకర్. పార్ట్ 2 డిజాస్టర్ కావడంతో ఇక పార్ట్ 3 ఉండదని అందరు అనుకున్నారు. కానీ అందరిని ఆశ్చర్యపరుస్తూ భారతీయుడు 3ని రిలీజ్ చేయబుతున్నామని ప్రకటించింది చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్. అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భారతీయుడు 3: వార్ మోడ్' నుండి మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. "అవినీతిపై ఏమాత్రం సహనం లేని సేనాపతి మళ్లీ తిరిగివచ్చాడు.. సరికొత్త యుద్ధం మొదలైంది!" అంటూ చిత్రబృందం ప్రకటించింది. అయితే భారతీయుడు 2 రిలీజ్ ప్రమోషన్స్ లో కమల్ హాసన్ మాట్లాడుతూ ' నేను ' భారతీయుడు పార్ట్ 3'కి పెద్ద అభిమానిని. కొందరు నాకు మొదటి భాగం ఇష్టమని, మరికొందరు రెండో భాగం ఇష్టమని అంటుంటారు కానీ నాకు ఇష్టమైనది మాత్రం ఇండియన్ 3. మరి బిగ్గెస్ట్ డిజాస్టర్స్ కి సీక్వెల్ గా వస్తున్న ఇండియన్ 3 ఎప్పుడు రిలీజ్ అవుతోందో ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి.

## ప్లానింగ్ లోపమా..? ఓటీటీ నిబంధనలా..?




టాలీవుడ్ ఇండస్ట్రీని దశాబ్దాలుగా ఏలుతున్న ఆ నలుగురు సీనియర్ అగ్ర హీరోలు ప్రస్తుతం ఒక విచిత్రమైన డైలమాను ఎదుర్కొంటున్నారు. ఒకే సమయంలో భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ స్టార్లలో నాగార్జున, బాలకృష్ణ విడుదల తేదీల విషయంలో ప్రశాంతంగా కనిపిస్తుంటే.. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ లు మాత్రం అయోమయంలో మునిగిపోయారు. సరైన ప్లానింగ్ లోపించడమే ఈ స్టార్ హీరోల ప్రాజెక్టులకు కొత్త తిప్పలు తెచ్చిపెడుతుందా అనే చర్చ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. విక్టరీ వెంకటేష్ నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం AK47' చిత్రం వాస్తవానికి అక్టోబర్ 9న విడుదల కావాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో అక్టోబర్ 30కి షిఫ్ట్ అయ్యేలా కనిపిస్తోంది. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన చేస్తున్న మరో చిత్రం సంక్రాంతి పండుగ బరిలో జనవరి 12న విడుదలకు సిద్ధమవుతోంది. కేవలం రెండు నెలల స్వల్ప వ్యవధిలోనే ఒకే హీరో నటించిన రెండు సినిమాలు థియేటర్లలోకి రావడం అభిమానులకు పండగే అయినా, మార్కెట్ బిజినెస్ పరంగా ఇది చాలా పెద్ద రిస్క్. ఓటీటీ ఒప్పందాల గడువులు, థియేట్రికల్ రన్ లెక్కలు వెంకీ ప్రాజెక్టులకు కొత్త చిక్కులను తెచ్చిపెడుతున్నాయి. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి సైతం సరిగ్గా ఇలాంటి సమస్యనో ఎదుర్కొంటున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'కాకా' సంక్రాంతి సీజన్‌లో జనవరి 13న విడుదలకు ఫిక్స్ అయింది. మరోవైపు ఓటీటీ అగ్రిమెంట్ల నిబంధనల కారణంగా 'విశ్వంభర' చిత్రాన్ని వీలైనంత త్వరగా థియేటర్లలోకి తీసుకురావాల్సిన ఒత్తిడి నెలకొంది. దర్శకులు బాబీ కొల్లి, అనిల్ రావిపూడి ఇద్దరూ పండుగ రిలీజ్ డేట్ల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడంతో.. చిరు, వెంకీలకు తమ సినిమాల రిలీజ్ డేట్ల సర్దుబాటు పెద్ద తలనొప్పిగా మారింది. తమ చిత్రాలతో తామే పోటీ పడాల్సిన విచిత్ర పరిస్థితి వీరిద్దరికీ ఏర్పడింది. చిరు, వెంకీ తమ చిత్రాల రిలీజ్ తేదీల క్లాష్‌తో సతమతమవుతుంటే.. నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున మాత్రం ఎలాంటి ఒత్తిడి లేకుండా పూర్తి సేఫ్ జోన్‌లో ఉన్నారు. వీరిద్దరూ తమ చిత్రాలతో తాము పోటీ పడే పరిస్థితి లేకుండా చూసుకున్నారు. డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా 'కింగ్ 100', 'దాదా' చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద ఒకరితో ఒకరు నేరుగా 'నువ్వా నేనా' అంటూ తలపడేందుకు సిద్ధమయ్యారు. క్లియర్ ప్లానింగ్‌తో ఉండటంతో నాగ్, బాలయ్య చాలా కూల్‌గా ఉండగా.. చిరు, వెంకీల సినిమాల రిలీజ్ షెడ్యూల్స్ మాత్రం ప్రస్తుతానికి సందిగ్ధంలోనే కొనసాగుతున్నాయి.




## ఎనిమిదేళ్ల తర్వాత హిట్ కాంబో రిపీట్..

కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ డైరెక్టర్ అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో ఓ కొత్త ఫాంటసీ యాక్షన్ చిత్రంలో నటించబోతున్నట్లు సమాచారం. దాదాపు ఎనిమిదేళ్ల గ్యాప్ తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే 2018లో వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఇమైక్కా నొడిగల్' మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు అదే జోరుతో మరో పవర్‌ఫుల్ ఫాంటసీ కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాజా ట్రెండ్‌కు తగినట్లుగా యాక్షన్ ఎలిమెంట్స్ హైలైట్ అయ్యేలా ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. విజువల్ పరంగానూ ఈ ప్రాజెక్ట్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని టాక్. ఈ భారీ చిత్రాన్ని 'పాషన్ స్టూడియోస్' బ్యానర్‌పై నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతుండగా.. నయనతార సొంత బ్యానర్ 'రౌడీ పిక్చర్స్' కూడా ఇందులో భాగస్వామిగా చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

## హోదాల కంటే గౌరవమే విలువైనది..



దయచేసి లేనిపోని విషయాలను తన పేరుతో ముడిపెట్టవద్దని, తన ప్రమేయం లేని విషయాల్లో తన పేరును ఎక్కడా ఉపయోగించవద్దని కోరారు. తాను ఎప్పుడూ చెప్పని విషయాలను తన మాటలుగా, తాను చేయని పనులను తన పనిగా ప్రచారం చేయవద్దని అన్నారు. ఇప్పటివరకు వస్తున్న పుకార్లకు, గాలి వార్తలకు స్పందించకపోవడం కేవలం తన సంయమనం మాత్రమేనని స్పష్టం చేశారు. ఇకనైనా తన పేరును అనవసరమైన వివాదాలకు దూరంగా ఉంచాలని, దయచేసి తన పేరు మీద రాజకీయాలు చేయవద్దని, రాజకీయాలకు ఉపయోగించొద్దని రాసుకొచ్చారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**